12. 3. 2026
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
గురువారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 275 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper



## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

- రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం
- సిఎం రేవంత్ తదితరుల హాజరు

2 లో..

## తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి

'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు

- ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి
- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

### అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ



**హైదరాబాద్,మార్చి11( వెలుతురు):** తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే




## పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని
- గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం
- అక్కడి ప్రభుత్వాలు భారత్‌కు అండగా నిలిచాయి
- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు
- విమర్శించడమే రాహుల్‌కు తెలిసిన పని
- కేరళం పర్యటనలో మోడీ గాటు విమర్శలు



**తిరువనంతపురం,మార్చి11 వెలుతురు:** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్



## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

- మూజువాణి ఓటుతో తిరస్కరించిన సభ
- రెండ్రోజుల పాటు సభలో సుదర్ఘంగా చర్చ
- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- స్పీకర్‌ను అవమానించడం తగదని కాంగ్రెస్‌కు హితవు
- ఓటింగ్ అనంతరం సభ నేటికి వాయిదా

## ఆ ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే

### కడియం, దానంలకు క్లీన్‌చిట్, వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు



- తుది తీర్పు వెలువరించిన స్పీకర్ ప్రసాదరావు,
- తీర్పును స్వాగతించిన దానం, కడియం ,
- నేడు సుప్రీంలో కేసు తుది విచారణ

**హైదరాబాద్,మార్చి11 వెలుతురు:** పార్టీ మారాన్ని పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసును స్పీకర్ మొత్తంగా కొట్టివేశారు. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. వీరు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని.. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిద్దరూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నట్లు స్పీకర్ ప్రకటించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తరువాత వారు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నారని.. వీరి శాసనసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ నుంచి పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తుది తీర్పును ప్రకటించారు. తాజా విచారణలో తాము ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని దానం నాగేందర్,

## తాను పార్టీ మారలేదు..కాంగ్రెస్‌లో చేరలేదు



- బిఆర్ఎస్ ఏనాడూ అలా నోటీసులు ఇవ్వలేదు
- కెసిఆర్ అంటే ఇప్పటికీ గౌరవం ఉంది
- తనపై ఫిర్యాదు చేసే అధికారం కౌశిక్ రెడ్డికి ఎక్కడిది
- స్పీకర్ తీర్పును స్వాగతించిన దానం నాగేందర్

## నైతిక విలువలు నా ఒక్కడికేనా

- కెసిఆర్ కూడా నైతికత పాటించారా.
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఎలా ఇచ్చారు
- స్పీకర్ తీర్పును స్వాగతించిన కడియం శ్రీహరి






## వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం


- డిసెంబర్ 9లో కాలనీ నిర్మాణం పూర్తి,
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం ,
- రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు మా ప్రభుత్వ లక్ష్యం,
- నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు ,
- వెలుగుమట్ బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన భట్టి



**ఖమ్మం,మార్చి11 వెలుతురు:** కాంగ్రెస్ సర్కారు పేదల గురించి ఆలోచించే ప్రభుత్వమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క పేద కూడా గూడు ఉండకూడదని నిర్ణయించి ఇందిరమ్మ ఇల్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను భట్టి బుధవారం పంపిణీ చేశారు. మంత్రులు పొంగులేటి, తుమ్మలత కలిసి ఆయన స్థల పట్టాలు

## సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యల ఆకళింపు
- 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు
- ఉగాదికి 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహప్రవేశాలు
- రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గించేలా చర్యలు
- సౌర వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,మార్చి11 వెలుతురు:** సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. అధికారులు- ప్రజాప్రతినిధుల కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు.


## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్‌పై బండి సంజయ్



**హైదరాబాద్,మార్చి11 వెలుతురు:** కడియం శ్రీహరి, దానం నాగేందర్ లపై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేయడం దారుణమని కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో శాసన వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. కన్నతల్లే బిడ్డను చంపడం ఎంత

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా



హైదరాబాద్,మార్చి11 వెలుతురు :
తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.

## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

పాపమో.. శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంత కంటే పాపమని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. శాసన వ్యవస్థే ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ తీర్పు ఇవ్వడాన్ని మండిపడ్డారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసినప్పటికీ అనర్హత వేటు వర్తించకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేసినా పార్టీ ఫిరాయించలేదని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. గాంధీభవన్‌లో సంసారం చేస్తూ.. కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తున్నా ఫిరాయింపులు వర్తించకపోవడం ప్రజాస్వామ్యానికి చేటు అని బండి సంజయ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించింది నిజం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. శాసన వ్యవస్థపై ప్రజలకు పూర్తిగా నమ్మకం కోల్పోయేలా స్పీకర్ తీర్పు ఇచ్చారని బండి సంజయ్ అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కాంగ్రెస్ ఆఫీసులో బంధించాలని చూస్తున్నారని ఆరోపించారు. శాసనసభ స్పీకర్? స్వతంత్ర్యంగా వ్యవహరించాలే తప్ప డూప్లికేట్ గాంధీ కుటుంబానికి తాబేదారులా వ్యవహరించకూడదని సూచించారు. ప్రజాస్వామ్యవాదులారా నోరు విప్పండి అని పిలుపునిచ్చారు. పూర్తిగా గాడి తప్పిన శాసన వ్యవస్థను దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రజలదే అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేస్తే తప్ప తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేమని బండి సంజయ్ స్పష్టం చేశారు. స్పీకర్ తీర్పుపై హైకోర్టుకు వెళ్తామని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. బెంగాల్‌లో అనర్హత పిటిషన్ పై స్పీకర్ ఇదే తరహా తీర్పు ఇస్తే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో కొట్టేసిందని గుర్తుచేశారు. తెలంగాణలోనూ ఫిరాయింపులపై చెంప చెళ్లుమనేలా న్యాయ వ్యవస్థ తీర్పు ఇస్తుందనే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు.

## తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి

ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

**న్యూఢిల్లీ,మార్చి11( వెలుతురు):**



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది. ఆ వెంటనే లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ గురువారంనాటికి వాయిదా వేశారు. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి బుధవారం వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. భారత ప్రజాస్వామ్యాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. స్పీకర్ ఉద్దేశాలను ఎవరూ తప్పు పట్టాల్సిన అవసరంలేదని అమిత్ షా అన్నారు. స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం. స్పీకర్ స్థానం దిశగా ప్రతిపక్షసభ్యులు పేపర్లు విసిరారు. అందరూ లోక్‌సభ నిబంధనలు పాటించాలి. సభలో ఎలా మాట్లాడాలో థరూర్ నేర్పించాలి. కాంగ్రెస్ నేతలకు థరూర్ ఎందుకు హిత బోధ చేయరని అన్నారు. కాంగ్రెస్ నిబంధనలు పార్లమెంటును నడపజాలవు. తప్పులు సరిదిద్దుకొనేందుకు ప్రతిపక్షాలకు అవకాశం వచ్చిందని అమిత్ షా అన్నారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒక స్పీకర్ పై ఇలాంటి తీర్మానం రావడం దురదృష్టకరమని, ఇది పార్లమెంటరీ సంప్రదాయాలను కించపరచడమే అని ఆయన పేర్కొన్నారు. స్పీకర్ స్థానాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదని అమిత్ షా స్పష్టం చేశారు. 'స్పీకర్ పదవికి రాజకీయాలతో సంబంధం లేదు. సభలో ఆయన అందరివాడు, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే స్పీకర్ ఎంపిక జరిగింది. అటువంటి వ్యక్తి నిబద్ధతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. సభా నిబంధనలను కాంగ్రెస్ పార్టీ పదే పదే ఉల్లంఘిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సభలో అమలవుతోన్న నిబంధనలు నెహ్రూ కాలంలో రూపొందబడ్డాయి, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సభా మర్యాదలను కాపాడటంతో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి, నిబంధనలను పాటించకుండా స్పీకర్ పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

# ఆ ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే

కడియం శ్రీహరి స్పష్టం చేశారు. దానం, కడియం వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. వీరిద్దరినీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. అనర్హత వేటు పిటిషన్లను కొట్టేశారు. దీంతో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు ఊరట లభించినట్లయ్యింది. ఇదిలాఉంటే.. గురువారం సుప్రీంకోర్టులో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై విచారణ జరగనుంది. ఇప్పటికే పలుమార్లు విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. కేసు మళ్లీ విచారణకు వచ్చేలోగా స్పీకర్ తన నిర్ణయం ప్రకటించాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఇప్పటికే 8మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరికి క్లీన్ చిట్ ఇవ్వండతో మొత్తం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. అయితే టెక్నికల్‌గా ఇది రుజువు కాకపోవడంతో దీనిని స్పీకర్ తిరస్కరించారు. ఈ క్రమంలో నేటి సుప్రీం విచారణలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

### నైతిక విలువలు నా ఒక్కడికేనా

అనర్హత పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వాగతించారు. ప్రస్తుతం తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో తనకు సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లినా ఎదుర్కొంటానని.. ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో జరిగిన ఫిరాయింపులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు తనకు మాత్రమే వర్తింస్తాయా? కేసీఆర్‌కు వర్తించవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ తన హయాంలో జరిగిన ఫిరాయింపులకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. 'కేసీఆర్ క్షమాపణ చెప్పితే నేను రాజీనామాకు సిద్ధం' అని స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కేసీఆర్ మంత్రులుగా చేయలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ శాసనసభా పక్షం బీఆర్ఎస్‌లో విలీనం కాకముందే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రిని చేశారని, ఇది నైతికమా? అని సవాల్ విసిరారు. రాజకీయంగా తమను ఎదగకుండా చేయడానికే కేసీఆర్ జిల్లాల విభజన చేశారని కడియం శ్రీహరి ఆరోపించారు. ఎంతో చరిత్ర ఉన్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించి నట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని సిద్దాంతపరంగా విభేదించానని ఎమ్మెల్యే అన్నారు. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి ప్రైవేట్ యూనివర్సిటీలు ఇవ్వడానికే తన స్థానంలో సబితను విద్యాశాఖ మంత్రిని చేశారని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు తాను వ్యతిరేకమని.. అన్ని విషయాలు త్వరలోనే బయటపెడతానని హెచ్చరించారు.

### తాను పార్టీ మారలేదు.. కాంగ్రెస్‌లో చేరలేదు

తాను బిఆర్ఎస్ ప ఆర్టీ మారలేదని, అలాగే తాను పార్టీ మారానని ఏనాడు పార్టీ నుంచి నోటీసులు రాలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. స్పీకర్ అనర్హత విషయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని దానం నాగేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపీగా పోటీ చేయడం తన వ్యక్తిగత విషయమని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏరోజు పనిచేయలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనకు ఎప్పుడూ విప్ ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ పరిధిలో తాను ఎక్కడా పొరపాటు చేయలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ సంచలన తీర్పు వెలువరించారు.

రెండు పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరు సభ్యులు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పష్టం చేశారు. దీంతో దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు బిగ్ రిలీఫ్ లభించింది. ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. 'నేను కేసీఆర్‌కు జవాబుదారీగా ఉంటాను.. ఇన్ని రోజులు నాపై ఫిర్యాదు చేసిన వాళ్ల గురించి మాట్లాడలేదు. నాపై ఏ అధికారంతో ఫిర్యాదు చేశారని ఇప్పుడు అడుగుతున్నాను. నాపై కొందరు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేశారు. స్పీకర్ పరిధిలో నేను ఏ తప్పూ చేయలేదు. తీర్పు ఎలా ఉన్నా నాకు ఒకే. ఉప ఎన్నికలకు వెళ్లాల్సి వస్తే సిద్ధమే. పాదయాత్ర చేసి మళ్ళీ గెలుస్తాను. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను. ఉపఎన్నిక వస్తే భయపడేది లేదు. పోటీ చెయ్యడానికి జీనా బితిప సఃజీటా. నేను కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోలేదు.. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చెయ్యలేదు. హైదరాబాద్ వాసిగా నాకు ఎప్పటికైనా ఎంపీ అవ్వాలని నా కోరిక.. అందుకే నేను ఎంపీగా పోటీ చేశానని తీర్పు తరవాత మీడియాతో వెల్లడించారు. తనకు క్రమశిక్షణ పరంగా ఏవైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటే కెసిఆర్‌కు అధికారం ఉందన్నారు. తనపై కేసు వేయడానికి కౌశిక్ రెడ్డి ఎవరని అన్నారు. తనకు కెసిఆర్ అంటే గౌరవం ఉందన్నారు.

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

## వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

అందచేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. పేదలందరికీ ఇల్లు ఉండాలనేది తమ ఆశయం అన్నారు. తొలి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇళ్లు మంజూరు చేయడంతో పాటు.. నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పేదల నిస్సహాయతను అడ్డుగా పెట్టుకుని కొందరు రాజకీయాలు చేశారు. అమాయకులను మోసం చేసి రూ.లక్షల్లో వసూలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు నీరు, విద్యుత్ సౌకర్యం ఎందుకు కల్పించలేదని భట్టి ప్రశ్నించారు. ఇక్కడి పేదలను కొందరు మోసం చేస్తున్నారని కోర్టు చెప్పింది. మేం మానవీయ కోణంలో వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తున్నాం. అర్హులకు స్థలంతో పాటు.. ఇంటి నిర్మాణం చేసి ఇస్తున్నాం. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నాం అన్నారు. ఇన్నాళ్లు వెలుగుమట్ల పేదలను ఎందరో వచ్చి బెదిరించారు. ఇకపై వీరిని ఎవరూ బెదిరించలేరు.. డబ్బు వసూలు చేయలేరు. ఇకపై వారు నిర్భయంగా బతకవచ్చు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచే తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని భట్టి విక్రమార్క చెప్పారు.వెలుగుమట్లలో పేదల కోసం మోడల్ కాలనీ నిర్మిస్తాం, దేశంలోని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసే విధంగా మోడల్ కాలనీ నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వెలుగుమట్లలో పేదలకు పంచగా మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి ఉపయోగిస్తాం అన్నారు. భూదాన్ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాదు కరెంటు, నీళ్లు, రోడ్లు, ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి డిసెంబర్ 9 కల్లా మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను, ముగ్గురు మంత్రులము కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తాం డిసెంబర్ 9 కల్లా నిర్మాణం పూర్తి చేయాలి పాలు పొంగించాలి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు జరగాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇది పేదల పక్షాన మాకు ఉన్న నిబద్ధత అన్నారు. ఇల్లు కట్టిస్తామని పది సంవత్సరాలపాటు పరిపాలించిన వారు చెప్పిన మాటలు నమ్మి చూసి చూసి పేదల కళ్ళు కాషాయని, వారు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అలాంటి వారికి మా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. ఈ రాష్ట్రంలో జీవించే ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి అనేది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఆలోచన అన్నారు. ఆ ఆలోచనలో భాగంగానే రాష్ట్రంలో పేదవారి కోసం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు 22,500 కోట్లు ఒకేసారి మంజూరు చేసి చేసే చరిత్రలోనే రికార్డు సృష్టించిన ప్రభుత్వం తమది అనే డిప్యూటీ సీఎం తెలిపారు. ఇలాంటి ప్రభుత్వంపై కావాలని పేదలకు మేలు జరగవద్దని కొద్దిమంది బురద జల్లుతున్నారు అని డిప్యూటీ సీఎం ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాలుగా మాఫియా వెలుగుమట్లలో పేదల నుంచి డబ్బులు వసూలు చేసింది వారికి కనీస సౌకర్యాలు లేకుండా సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసింది, పేదలు ఆత్మగౌరవంతో బతికేలా చేయాలని వెలుగుమట్లలో అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టింది అన్నారు. పేదలు చట్టబద్ధంగా న్యాయబద్ధంగా ఆత్మ గౌరవంగా బతికేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు ప్రజా ప్రభుత్వం వెనుకాడదని తెలిపారు. వెలుగుమట్లలో అర్హత కలిగిన 412 మందిని గుర్తించి తన తమ భేదం లేకుండా జిల్లా పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో ఉన్న 101 మంది పేదలకు వారి గ్రామాల్లో ఉన్న స్థలాల్లో ఇందిరమ్మ నిర్మాణానికి అనుమతి పత్రాలు మంజూరు చేసినట్టు తెలిపారు. పేదల నిస్సహాయతను అడ్డుపెట్టుకొని బతికే మాఫియా శక్తులను దరిదాపుల్లోకి రానివ్వద్దని పేదలకు, అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. వెలుగుమట్ల పేదలను కొన్ని ముఠాలు మోసం చేశాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భూదాన్ ట్రస్టు సభ్యులుగా చెప్పుకొని కొందరు మోసం చేసినట్లు ఆరోపించారు.

ఇన్నాళ్లు కోర్టులో ఉన్నందువల్లే వెలుగుమట్లలో సదుపాయాలు కల్పించలేకపోయినట్లు తెలిపారు. కోర్టు తీర్పు మేరకే ఇక్కడి భూముల్లో ఉన్నవారిని కలెక్టర్ ఖాళీ చేయించాల్సి వచ్చిందన్నారు. ఖాళీ చేయించే సమయంలో పేదలపై ఒక్క లాఠీ దెబ్బ పడొద్దని చెప్పామన్నారు. భూదాన్ భూములను ఎప్పటికైనా పేదలకే ఇవ్వాలని నిర్ణయించినట్లు వివరించారు.ఏ జిల్లా వారైనా సరే.. ఇంటి స్థలం లేకుంటే ఇంటి పట్టాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వెలుగుమట్లలో 412 మందికి న్యాయం చేస్తున్నామన్నారు. ఇక్కడి భూదాన్ భూముల్లో 311 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు చెప్పారు. మరో 101 మంది తమకు సొంత స్థలం ఉందని.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అడిగారని వివరించారు. వెలుగుమట్ల భూముల విషయంలో కొందరు మొసలి కన్నీరు కార్చారు. పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు ఇంటి పట్టాలు ఎందుకు ఇవ్వలేదు? పేదల పట్ల జాలి ఉంటే వారికి సాయం ఎందుకు చేయలేదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కొందరు పగటి కలలు కంటున్నారు. పేదల కష్టాలు తెలిసిన నిజమైన ప్రజా ప్రభుత్వం మాది. వెలుగుమట్లలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తాం. లబ్దిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే సదుపాయాలు పూర్తి చేస్తాం' అని పొంగులేటి అన్నారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అభిసంశన

**- తృణమూల్ కాంగ్రెస్ తీర్మానం..180 మంది సంతకాలు**

**న్యూఢిల్లీ,మార్చి11( వెలుతురు):**

పార్లమెంటు రెండో దఫా బడ్జెట్ సమావేశాలు మరోసారి వేడెక్కనున్నాయి. రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనుంది. విపక్ష 'ఇండియా' కూటమికి చెందిన 180 మంది ఎంపీలు ఇందుకు సంబంధించిన నోటీసుపై సంతకాలు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరిలో 120 మంది లోక్‌సభ ఎంపీలు, 60 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు.ప్రతిపాదిత అభిశంసన తీర్మానంలో సీఈసీపై తృణమూల్ కాంగ్రెస్ పలు ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా చేశారనేది ఆయనపై మెదటి ఆరోపణ. మార్చి 10వ తేదీన సమావేశమయ్యేందుకు ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన టీఎంసీ నేతల పట్ల సీఈసీ అనుచితంగా ప్రవర్తించారనేది రెండో ఆరోపణ. రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేశారనేది మూడో ఆరోపణ. అభిశంసన తీర్మానాన్ని ఉభయసభల్లోనూ ప్రవేశపెట్టాలని, ఈనెల 12న కానీ, 13న కానీ నోటీసు విపక్ష కూటమి తీర్మానాన్ని ఆమోదించినట్లయితే అభిశంసన ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కొంటున్న తొలి సీఈసీ కూడా జ్ఞానేశ్ కుమార్ అవుతారు. 1990లో అప్పటి సీఈసీ టీఎన్ శేషన్, 2006లో నవీన్ చావ్లాపై అభిశంసన తీర్మానం పెట్టాలనే చర్చలు జరిగినప్పటికీ అవి కార్యరూపంలోకి రాలేదు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన తరుణంలో హడావిడిగా పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడాన్ని మొదట్నించీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారు. ఓటర్ల జాబితా రివిజన్ ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు జరిగాయంటూ ఈసీకి ఈవారం మొదట్లో టీఎంసీ లేఖ రాసింది. లక్షలాది మంది అర్హులైన ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారని సీఎం ఆరోపించారు. ఎస్ఆర్ఐ పక్రియ పూర్తి చేసిన అనంతరం ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 28న ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 5,46,053 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించినట్టు ప్రకటించింది. దీనిపై మమతా బెనర్జీ నిరసనలకు దిగారు. కాగా, సీఈసీపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలంటే లోక్‌సభలో 100 మంది ఎంపీలు, రాజ్యసభలో 50 మంది ఎంపీలు సంతకాలు చేయాలి. ఉభయసభల్లో ఎక్కడైనా తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు. సీఈసీ అభిశంసన విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల అభిశంసనకు అనుసరించే పద్ధతినే పాటిస్తారు. అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ కానీ, రాజ్యసభ చైర్మన్ కానీ తొలుత పరిశీలిస్తారు. ఆరోపణలపై విచారణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆరోపణలను నిజమని కమిటీ నిర్ధారిస్తే అభిశంసన తీర్మానంపై ఉభయ సభల్లో ఓటింగ్ జరుపుతారు. ఓటింగ్‌కు హాజరయ్యే ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది తీర్మానాన్ని బలపరచాలి. తీర్మానం ఆమోదం పొందితే సీఈసీని పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు.

# సంపాదకీయం..

# జల్‌జీవన్‌తో శాశ్వత నీటి సమస్య పరిష్కారం అయ్యేనా ?

ఏటా వరదలు, నీటి కరువు సాధారణం అయ్యింది. వర్షాకాలంలో వరదలు ముంచెత్తితే..ఎండాకాలంలో మంచినీటి కటకటలు తప్పడం లేదు. ఈ సమస్య పరిష్కరానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమస్యపై స్పష్టమైన అవగాహన కలగడం లేదు. మనకు ఎన్నో జీవనదులు, సహజసిద్ధ వనరులు ఉన్నా, వాటిని వినియోగించడం ఎలా అన్న ఆలోచన చేయడం లేదు. ఎండాకాలం రాగానే తాత్కాలిక పథకాలతో మంచినీటి సమస్యను గట్టెక్కిస్తున్నారు. ఇకపోతే కేంద్రం జల్‌జీవన్ మిషన్ కింద లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా..శాశ్వత పరిష్కారం చూపడం లేదు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని కేంద్ర ప్రభుత్వం 2028 డిసెంబరు వరకు పొడిగించింది. 2019-2024 వరకే పరిమితమైన ఈ పథకం చాలా రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలుకాని విషయాన్ని ప్రభుత్వం పరిగణనలో తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ పథకం మొత్తం కేటాయింపులను రూ.8.69 లక్షల కోట్లకు పెంచింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పెంచాలని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రాలకు రూ.1.51 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం కలగనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు జాతీయస్థాయిలో సుజలం భారత్ పేరుతో ఒక డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తేనుంది. దీనికింద ప్రతి పల్లెను ఒక సుజల




గ్రామంగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు పూర్తయినట్లు గ్రామపంచాయతీలు ధ్రువీకరించి, ప్రతి ఇంటికీ కొళాయి నీరు అందించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే పథకం నిర్వహణకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తాయి. పథకాన్ని ప్రజలు సొంతం చేసుకొని సామాజికంగా, ఉమ్మడిగా నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఏటా 'జల్ ఉత్సవ్' కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని గ్రామాలనూ 'హర్‌ఘర్ జల్' గ్రామాలుగా తయారు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ పథకానికి అవసరమైన నీటి వనరులను సమకూర్చడంలో మాత్రం రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. జల్‌జీవన్ పథకం అమల్లో ఉన్నా గ్రామాల్లో మంచినీటి సమస్యలు తీరడం లేదు. కారణం నీటి వనరులను వినియోగించక పోవడమే. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణ మైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనారాహిత్యంతో పాటు ప్రకృతి సహాయనిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు. ప్రజల్లో అవ గాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది. ఇప్పుడు ఈ వ్యాపారం నగరాలకేకాక, మండల కేంద్రాలకు, గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నాఅడిగేవారు, అడ్డగిం చేవారు లేకుండా పోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు. ఇకపోతే లక్షలాది ఎకరాలకు సరి పోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రంపాలవుతున్నది. ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించ లేని అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాం.దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. పెడుతున్నా రు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్ర స్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలు న్నట్లు భూగర్భశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరు బావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపో తున్నది. విద్యుత్ డిమాండ్ తోపాటు నీటి వృథా కూడా పెరుగు తున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశం లోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భ జలాల వినియోగం మూడింతలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. దేశరాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజ స్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్లో ఇష్టానుసారంగా లక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. రాబోయే వేసవిలో మంచినీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.

# భూమి పంచాలని మొదలైన ఉద్యమం.. పేదవాడి గూడును కూల్చే దాకా ఎందుకు వచ్చింది?



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*భారతదేశ సామాజిక చరిత్రలో భూమి ప్రశ్న అత్యంత కీలకమైన సమస్యగా నిలిచింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా దేశంలోని కోట్లాది పేదలు, రైతు కూలీలు, దళితులు మరియు సామాజికంగా వెనుకబడిన వర్గాలు భూమిలేని పరిస్థితిలోనే జీవించాల్సి వచ్చింది. భూమి అంటే కేవలం ఆస్తి మాత్రమే కాదు; అది జీవనాధారం, గౌరవం, భద్రత, స్వాభిమానం అన్నీ కలిపిన ఒక ఆధారం. ఈ నేపథ్యంలో సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పేందుకు భూమిని పేదలకు అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన గొప్ప సామాజిక ఉద్యమం భూదానోద్యమం. ఈ ఉద్యమానికి ప్రేరణనిచ్చిన మహనీయుడు ఆచార్య వినోబా భావే. మహాత్మా గాంధీ ఆలోచనలకు వారసుడిగా భావించబడే వినోబా భావే సర్వోదయ తత్వాన్ని ఆధారంగా చేసుకొని భూమిలేని పేదలకు భూమి దక్కేలా చేయాలనే ఒక విశిష్టమైన సామాజిక ప్రయోగాన్ని ప్రారంభించారు.*

*"సర్వోదయ" అనే పదానికి అందరి అభ్యున్నతి, అందరి సంక్షేమం అనే అర్థం ఉంది. అంటే సమాజంలోని ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందే విధంగా సామాజిక వ్యవస్థను నిర్మించడం. ఈ భావజాలం కేవలం సిద్ధాంతంగా మాత్రమే కాకుండా ఒక ఉద్యమంగా మారిన సందర్భం భూదానోద్యమం. వినోబా భావే ఈ భావనను గ్రామాల మధ్య నడుచుకుంటూ ప్రజల హృదయాలను తాకే విధంగా ప్రచారం చేశారు. ప్రభుత్వ చట్టాలు లేదా బలవంతం కాకుండా, స్వచ్ఛందంగా భూస్వాములు తమ భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని కోరడం ఈ ఉద్యమం ప్రత్యేకత.*

తెలంగాణ ప్రాంతంలో భూదానోద్యమం ప్రారంభం కావడం భారతదేశ సామాజిక చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు. ఎందుకంటే ఆ కాలంలో తెలంగాణ రాజకీయంగా, సామాజికంగా తీవ్రమైన కల్లోల పరిస్థితులను ఎదుర్కొంటోంది. నిజాం పాలన చివరి దశలో రజాకార్ల హింస, రైతాంగంపై జరిగిన అణచివేతలు, తరువాత కమ్యూనిస్టుల సాయుధ పోరాటం, పోలీసు చర్యలు ఇవన్నీ కలిసి గ్రామీణ సమాజాన్ని అస్థిరతలోకి నెట్టాయి. 1948లో జరిగిన Operation Polo అనంతరం హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో శాంతి పూర్తిగా నెలకొనలేదు. ఈ పరిస్థితుల్లో సమాజంలో శాంతి, పరస్పర విశ్వాసం, సామాజిక న్యాయం పునరుద్ధరించేందుకు సర్వోదయ నాయకులు శాంతియాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. 1951 ఏప్రిల్‌లో హైదరాబాద్ సమీపంలోని శివరాంపల్లిలో సర్వోదయ సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణలో శాంతి యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఆ సమావేశానికి వినోబా భావే హాజరై స్వయంగా పాదయాత్రకు నాయకత్వం వహించేందుకు సిద్ధమయ్యారు. 1951 ఏప్రిల్ 15న ఆయన శివరాంపల్లి నుండి తన పాదయాత్రను ప్రారంభించారు. ఆయన వెంట సర్వోదయ కార్యకర్తలు, స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు. ఆ యాత్రలో పాల్గొన్న వారిలో తరువాత ప్రముఖ రాజకీయ నాయకుడిగా ఎదిగిన మర్రి చెన్నారెడ్డి, వంటి నాయకులు కూడా ఉన్నారు.


1951 ఏప్రిల్ 18న వినోబా భావే బృందం నల్గొండ జిల్లాలోని పోచంపల్లి గ్రామానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ సమావేశంలో కొంతమంది దళితులు తమకు సాగు చేసుకునేందుకు భూమి ఇవ్వాలని వినతి చేశారు. వారి మాటలు వినగానే గ్రామానికి చెందిన భూస్వామి,వెదిరె రామచంద్ర రెడ్డి , ఒక చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. తన కుటుంబానికి చెందిన 100 ఎకరాల భూమిని దళితులకు పంచేందుకు దానంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే ఒక దానపత్రం రాసి వినోబా భావేకు అందజేశారు. ఈ సంఘటనతో భూదానోద్యమానికి ఆరంభం లభించింది. పోచంపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటన తరువాత భూదానోద్యమం దేశవ్యాప్తంగా వ్యాపించింది.

వినోబా భావే మొదటి పాదయాత్ర తెలంగాణలో దాదాపు 51 రోజుల పాటు సాగింది. ఈ యాత్రలో ఆయన దాదాపు 200 గ్రామాలను సందర్శించారు. ప్రతి గ్రామంలో ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ భూస్వాములను తమ భూమిలో కనీసం ఒక ఆరవ వంతు భాగాన్ని భూదానంగా ఇవ్వాలని కోరారు. ఈ పిలుపుకు అనేక మంది స్పందించారు. ఈ పాదయాత్రలో దాదాపు 12 వేల ఎకరాల భూమి దానంగా లభించింది. ఈ భూమిని పేదలకు పంపిణీ చేయడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఈ ఉద్యమానికి మద్దతుగా హైదరాబాద్ రాష్ట్రానికి చివరి నిజాం అయిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కూడా భూమిని దానం చేశారు. ఆయన సుమారు 3500 ఎకరాల భూమిని భూదానంగా ఇచ్చినట్లు చరిత్రలో నమోదు ఉంది. ఈ సంఘటన ఉద్యమానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది.

భూదానోద్యమం దేశవ్యాప్తంగా విస్తరించడంతో అది ఒక సామాజిక విప్లవంగా మారింది. అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒక సందర్భంలో మాట్లాడుతూ "భారత ప్రభుత్వానికి ఉన్న వేలాది సైన్యం చేయలేని పనిని ఒక నిరాడంబర వ్యక్తి తెలంగాణలో సాధిస్తున్నాడు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య భూదానోద్యమం సామాజిక ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

ఇకతెలంగాణలో వినోబా భావే భూదానోద్యమ రెండో పాదయాత్ర 1955, డిసెంబర్లో ఖమ్మం జిల్లాలోని ఎర్రపాలెం నుంచి ప్రారంభమైంది. ఈ యాత్రకు తెలంగాణ సరిహద్దుల్లోని కొల్లురు(ఖమ్మం జిల్లా)లో అప్పటి హైదరాబాద్ సీఎం బూర్గుల రామకృష్ణారావు, ఇతర సర్వోదయ నాయకులు వినోబా భానేకు స్వాగతం పలికారు. ఈ యాత్ర 1956, ఫిబ్రవరి 5న హైదరాబాద్ కు చేరుకున్నది. వినోబా భానే హైదరాబాద్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో బస చేశాడు. అప్పుడు ఆయనను చాలా మంది ప్రముఖులు కలుసుకున్నారు. వారిలో నవాబ్ దీర్ఘార్ జంగ్ పిన్ ఆఫ్ బేరార్, మెల్కోటే, మర్రి చెన్నారెడ్డి జె.వి.నర్సింగరావు, పద్మజానాయుడు ముఖ్యమైన వారు భూదాన ఉద్యమానికి మద్దతుగా



1956, షిబ్రవరి 6న హైదరాబాద్లో విద్యార్థులు ఒక ఊరేగింపును జరిపి వివేకవర్ధిని కాలేజీ ఆవరణలో బహిరంగవడను నిర్వహించార. ఇక 1956, ఫిబ్రవరి 8వ భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ హైదరాబాద్ రాష్ట్రాన్ని సందర్శించినప్పుడు పాలమాకుల గ్రామంలో వినోదా భాషను కలుసుకుని 3 గంటలపాటు భూదానోద్యమ యాత్రలో పాల్గొన్నాడు. వాటి భారత ప్రధాని సహా 1956, మార్చి 5న రాష్ట్రా నికి వచ్చినప్పుడు మహబూబ్నగర్ జిల్లాలోని మాధవరావు పల్లెలో వినోబా భావేను కలుసు కుని భూదానోద్యమానికి తన పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు ఈ రెండో భూదాన యాత్రకు కూడా కేతిరెడ్డి కోదంచరామిరెడ్డి ఇన్ చార్జిగా వ్యవహరించాడు. ఈ రెండో భూదాన పాదయాత్ర తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్ చివరి మజిలీగా రాయలసీమలోకి ప్రవేశించింది. వినోబా బాదే తన రెండో భూదానయాత్ర ద్వారా 42,000 ఎకరాలను భూదానంగా పొందాడు. అయితే, వినోబా భావే తెలంగాణలో ప్రారంభించిన భూదాన యాత్రలో ఆయనతోపాటు ప్రభుత్వా నికి సంబంధించిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఉండటంతో కమ్యూనిస్టులు భూదానోద్యము యాత్రను వ్యతిరేకించారు. వినోబా భానే కూడా ప్రభుత్వ ఏజెంట్ అని మర్శించారు.

కాలక్రమంలో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది. మొదటి పదిహేను సంవత్సరాల్లోనే దాదాపు 42 లక్షల ఎకరాల భూమి భూదానంగా సేకరించబడింది. ఈ భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయడానికి భూదాన యజ్ఞ సమితులు ఏర్పడ్డాయి. తెలంగాణలో కూడా భూదాన యజ్ఞ బోర్డు ఏర్పడి భూమి పంపిణీ బాధ్యతలను నిర్వహించింది. అయితే కాలం గడిచేకొద్దీ భూదాన భూముల పరిపాలనలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో భూములు సరైన రీతిలో పంపిణీ కాలేదు. కొన్ని చోట్ల పేదలు నివసిస్తున్న భూములపై వివాదాలు తలెత్తాయి. తెలంగాణలో ఇటీవల వెలుగులోకి వచ్చిన ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూముల వివాదం కూడా ఈ చరిత్రను మళ్లీ గుర్తు చేసింది.

వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న కొన్ని సర్వే నంబర్లలో సుమారు 60 ఎకరాల భూమి భూదాన్ ట్రస్ట్‌కు సంబంధించినదిగా స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో అక్కడ పేదలకు చిన్నచిన్న స్థలాలు కేటాయించినట్లు రికార్డులు ఉన్నాయని వారు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో వేలాది పేదలకు సుమారు 100 గజాల చొప్పున పట్టాలు ఇచ్చినట్లు సమాచారం. ఆ పత్రాల ఆధారంగా వారు అక్కడ గుడిసెలు వేసుకుని తరువాత క్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారు. కాలక్రమంలో ఆ ప్రాంతం ఒక కాలనీగా మారింది. అయితే ఇటీవల ప్రభుత్వం ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అక్కడి ఇళ్లను కూల్చివేయడం పెద్ద వివాదానికి దారి తీసింది. పేదలు దాదాపు పదిహేను సంవత్సరాలుగా నివసిస్తున్న ఇళ్లను ఒక్కసారిగా అక్రమంగా ప్రకటించడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఒకవేళ వారు నిజంగానే అక్రమంగా నివసిస్తున్నట్లయితే ఇన్ని సంవత్సరాలుగా అధికారులు ఎందుకు మౌనం పాటించారు అనే ప్రశ్న కూడా ప్రజల్లో వినిపిస్తోంది.

ఇక్కడ రాజ్యాంగ హామీలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి పౌరుడికి గౌరవంతో జీవించే హక్కును కల్పిస్తుంది. సుప్రీంకోర్టు కూడా అనేక తీర్పుల్లో నివాస హక్కు జీవించే హక్కులో భాగమని స్పష్టం చేసింది. అంటే పేదలను అకస్మాత్తుగా రోడ్డున పడేయకుండా వారికి తగిన పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

వెలుగుమట్ల ఘటనలో బాధితుల్లో విద్యార్థులు, కూలీలు, చిన్న వ్యాపారులు కూడా ఉన్నారు. వారి ఇళ్లను కూల్చివేయడం వల్ల వారు ఒక్కసారిగా నివాసం కోల్పోయారు. అభివృద్ధి పేరుతో జరిగే చర్యలు ప్రజల జీవితాలను కాపాడే విధంగా ఉండాలి. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రహదారులు నిర్మించడం మాత్రమే కాదు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కూడా అంతే ముఖ్యమైనది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. కానీ ఆ అధికారం ప్రజల సమ్మతితో, రాజ్యాంగ పరిమితుల్లోనే వినియోగించాలి. పేదల విషయంలో ప్రభుత్వం మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. సంపన్నుల విషయంలో చర్చలు, పరిహారాలు, సర్దుబాట్లు జరుగుతుంటే పేదల విషయంలో బలప్రయోగం త్వరగా కనిపించడం సమాజంలో అసమానత భావనను పెంచుతుంది.

బుల్డోజర్లు గోడలను మాత్రమే కూల్చగలవు. కానీ ప్రజల నమ్మకాన్ని కూల్చితే దాన్ని మళ్లీ నిర్మించడం చాలా కష్టం. అందుకే అభివృద్ధి మరియు మానవ హక్కులు పరస్పర విరుద్ధాలు కావు అనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. సరైన ప్రణాళికతో రెండింటినీ సమన్వయం చేయడం సాధ్యమే.

వెలుగుమట్ల ఘటన ఇప్పుడు ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెచ్చింది. అభివృద్ధి అంటే ఏమిటి? అది కేవలం భూముల విలువ పెరగడం, భవనాలు నిర్మించడం మాత్రమేనా? లేక సమాజంలోని ప్రతి వర్గానికి గౌరవంగా జీవించే అవకాశాలు కల్పించడమా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి ,రేవంత్ రెడ్డి తో పాటు ఖమ్మంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు రాష్ట్ర మంత్రులపై ఉంది.ఈ నేపథ్యంలో ఇప్పుడు అవసరం పారదర్శకత మరియు న్యాయం. వెలుగుమట్ల భూదాన్ భూములపై పూర్తి స్థాయి విచారణ జరగాలి. ఆ భూముల చట్టబద్ధ స్థితి ఏమిటి? పేదలకు ఇచ్చిన పట్టాల స్థితి ఏమిటి? అధికారుల నిర్ణయాల్లో ఎలాంటి లోపాలు జరిగాయి? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ప్రజలకు తెలియాలి. అదే సమయంలో బాధితులకు తక్షణ పునరావాసం కల్పించడం కూడా అత్యవసరం.

భూదానోద్యమం ఒకప్పుడు సమాజంలో నైతిక విలువలను మేల్కొలిపిన ఉద్యమం. ఆ ఉద్యమం ఆత్మస్ఫూర్తి పేదలకు గౌరవంగా జీవించే హక్కు కల్పించడమే. ఈ రోజు కూడా అదే స్ఫూర్తి పరిపాలనలో కనిపిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. అభివృద్ధి పేరుతో పేదల జీవితాలను పణంగా పెట్టడం కాదు, వారిని భాగస్వాములుగా చేసుకునే అభివృద్ధి మార్గం ఎంచుకోవాలి. అదే భూదానోద్యమం మనకు ఇచ్చిన నిజమైన పాఠం అనేది పాలకులు గుర్తుఎరగాలి.

# జయరాజు, సత్యనారాయణ లకు కుసుమ ధర్మన్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాలు



**హైదరాబాద్ వెలుతురు మార్చి 11:** కుసుమ ధర్మన్న కళాపీఠం ప్రతి సంవత్సరం తొలి తెలుగు దళిత మహాకవి కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి 'కుసుమ ధర్మన్న జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ను అందిస్తూ వస్తుంది. ఈ ఏడాది గాను ప్రజా కవి జి. జయరాజు, ప్రముఖ రచయిత డా. బండి సత్యనారాయణ లను పురస్కారాల కమిటీ ఎంపిక చేసినట్లు ధర్మన్న కళా పీఠం చైర్పర్సన్ డా. రాధా కుసుమ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారాలను ఈనెల 17 న రాజమహేంద్రవరంలో జరిగే కుసుమ ధర్మన్న జయంతోత్సవ వేడుకల్లో ప్రదానం చేయన్నున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ హర్ష కుమార్, తదితర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# హోంవర్క్ చేయలేదని గొడ్డును బాదినట్టు బాదుతారా ??

**- రత్నపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సి ఎస్ ఈ )**

**హెచ్ఓడి శివారెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 11:** సంగారెడ్డి జిల్లా ఆత్మకూరు మండలం తూర్కల ఖానాపూర్ గ్రామం దగ్గర గల రత్నపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో మొదటి సంవత్సరం సిఎస్సి చదివే విద్యార్థులను హోంవర్క్ చేయలేదని హెచ్ ఓ డి శివారెడ్డి గొడ్డును బాదినట్లు బాధడం అమానుష చర్య అని వెంటనే అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓయు లోని ఆర్ట్స్ కళాశాల వద్ద లింగంగౌడ్ మాట్లాడుతూ హోంవర్క్ చేయలేదనే చిన్న కారణంతో పదిహేను మంది విద్యార్థులను ఒక రూమ్ లో బంధించి కేబుల్ వైర్లతో రక్తం వచ్చేలా చితక బాధడని మానవ హక్కుల కమిషన్ ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్ఆర్సీకి లింగం గౌడ్ ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్ శివ యాదవ్ అరవింద్ నాగరాజు దండేపల్లి మనోజ్ ఎంగిలి గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్




**బషీర్ బాగ్ వెలుతురు 11 మార్చి :** అన్నదాతలను ఆదుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలం అయిందని రైతు ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు మండిపడ్డారు. యాసంగి పంట కాలం పూర్తయితున్న రైతులకు పంట సహాయం కిందా రైతు బంధు ఇవ్వలేక నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదని అన్నారు. హైద్రాబాద్, బషీర్బాగ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతులతో కలసి రైతు మహాగర్జన గోడ పత్రికను ఆవిష్కరించి రామారావు మాట్లాడారు. రైతు అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి రైతు బంధు వేస్తే రైతులు తాగి తులుతున్నారని రైతులపట్ల వ్యంగ్యంగా మాట్లాడడం సబబు కాదని మండిపడ్డారు. తక్షణమే వారం రోజుల్లో రైతుబందు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 16న ప్రారంభం అయ్యే అస్సెంబ్లీని వేలాది మంది రైతులతో కలసి ముట్టడిస్తమని రామారావు హెచ్చరించారు. రైతుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్28న కరీంనగర్ లో రాష్ట్ర స్థాయిలో రైతుల మహాగర్జన సమర భేరిని లక్షలాది మందితో నిర్వహిస్తనున్నట్లు పొలాడి రామారావు వెల్లడించారు.

# భాగ్యనగరంలో వెల్లివిరుస్తున్న మతసామరస్యం.



**బషీర్ బాగ్ వెలుతురు 11 మార్చి :** పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని... భాగ్యనగరంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. హైదరాబాద్ నాంపల్లి గృహకల్పలోని టీఎన్ జీఓఎస్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుసేన్ ఆధ్వర్యంలో.. దావత్ ఇ ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేశారు. మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మన్ ఫాహీముద్దీన్ ఖురేషి , టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీష్ తో పాటు.. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ప్రార్థన అనంతరం ఉద్యోగులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు.

# అప్పుల భాధతో ఆత్మహత్య చేసుకున్న బాలరాజు కుటుంబాన్ని ఆదుకోవాలి

**- చేనేత కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వాలే బాధ్యత వాహించాలి**

**- గుండు వెంకటనర్సు చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.**




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 11:** చేనేత వృత్తిలో పూటగడవక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు మిర్యాల బాలరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. బుధవారం రోజున రామన్నపేట మండల కేంద్రంలో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ,నూలు రంగుల ధరలుపెరిగి నేసిన బట్టలు అమ్మకాలులేక పొద్దంత పనిచేసిన పూటగడవక అప్పులపాలై చేనేత కార్మికులు చేసుకుంటున్న ఆత్మహత్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అన్నారు. నూలు రంగులపైనే కాదు నేసిన బట్టలపై కూడ స్ర్ర్ పేరుతో పన్నులు వేసి చేనేత పరిశ్రను మోడీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని, చేనేత రుణమాఫి, నేతన్న భరోసా, సంవత్సరంన్నర గడచిన అమలుకు నోచుకోలేదని, చనిపోయిన చేనేత కుటుంబాలకు ఏండ్లు గడచిన ఎక్స్ గ్రేషియా బాధిత కుటుంబాలకు అందడంలేదని విమర్శించ్చారు. మిర్యాల బాలరాజు కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ముషం సత్యనారాయణ, ముషం శ్రీనివాసు, ఎలగందుల అంబాదాసు, కూరపాటి బిక్షపతి, ముషం చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం వృత్తిదారులకు బడ్జెట్ లో కేటాయించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలి



**హైదరాబాద్ వెలుతురు మార్చి 11:** వృత్తిదారుల కార్పొరేషన్, ఫెడరేషన్ల సందర్శన సందర్భంగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ డిమాండ్. 2025-26 రాష్ట్ర బడ్జెట్ లో వృత్తిదారుల సంక్షేమానికి కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు కేటాయించిన 1018 కోట్లు ఈ నెల చివరి వరకు విడుదల చేసి ఖర్చు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి. రమణ డిమాండ్ చేశారు. ఈరోజు రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.ఆశయ్య, గొర్రెలు మేకల పెంపందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహ, హైదరాబాద్ మత్స్య సొసైటీ అధ్యక్షులు కొప్పు పద్మ, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్ల బండి కుమారస్వామి, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి నాగరాజు, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేశం, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విగ్నేష్ తదితరులతో కలిసి వృత్తిదారుల కార్పొరేషన్ లు, ఫెడరేషన్లు సందర్శించి అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ లో ఎంత ఖర్చు చేశారో వారిని అడిగి తెలుసుకున్నారు. వృత్తిదారులకు కేటాయించిన డబ్బులే తక్కువ అంటే అవి కూడా ఇవ్వలేదు. ఫలితంగా ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదు. కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి. కేటాయించిన డబ్బులు ఈ నెల చివరి వరకు ఖర్చు చేయకపోతే నిరుపయోగంగా మారిపోతాయి. అందుకని అవి వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఇంకా ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం నాయకులు బాలమణి,రజక సంఘం నాయకులు యం. గోపాల్,యాదగిరి చారి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కోమ్మాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 11:** గ్రామం కొమ్మాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. బుధవారం రోజున ప్రధానోపాధ్యాయులుగా ఎర్ర జ్యోతిబస్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బుర్ర భరత్ ఎంఈఓ గా సనావర్ మరియు జిల్లా కలెక్టర్ గా బాతుక మల్లేష్ వ్యవహరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్, సఫియా బేగం, కోట విజయ వెంకన్న, మందడి శ్రీనివాస్ రెడ్డి, బండ బాలరాజ్, గడ్డం శ్రీనివాస్, శ్రీనివాసాచారి, సమ్రీన్, మేడం గారెలు పాల్గొనడం జరిగింది. ఈరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమ అభిప్రాయాలను తను జీవితంలో సాధించాల్సిన లక్ష్యాల్ని వివరించడం జరిగింది. ఇది విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే కార్యక్రమంగా ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

# సమాజ అభివృద్ధికి అర్థశాస్త్ర పరిశోధనలే పునాది

**- ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం**

**- నిజాం కాలేజీలో "సమగ్ర వృద్ధి - సుస్థిర భారత్"పై జాతీయ సెమినార్**

**- పాల్గొన్న విద్యా రంగ ప్రముఖులు, మేధావులు**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 11:** "సమాజ అభివృద్ధికి అర్థశాస్త్ర పునాదిగా జరిగే పరిశోధనలు మరింత పటిష్టం కావాలి. అసమానతలు లేని అభివృద్ధి, నూతన ఉపాధి అవకాశాల కల్పన కోసం సమగ్రమైన పరిశోధనలు చేయడం నేటి చారిత్రక అవసరం" అని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ - చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం పేర్కొన్నారు. చారిత్రాత్మక నిజాం కాలేజీలోని అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఇంక్లూజివ్ గ్రోత్, సస్టైనబుల్ ఇండియన్ డెవలప్‌మెంట్: ఛాలెంజెస్ అండ్ ఇష్యూస్" (సమగ్ర వృద్ధి, సుస్థిర భారత అభివృద్ధి: సవాళు -అంశాలు) అనే అంశంపై జాతీయ సెమినార్ ఘనంగా నిర్వహించబడింది. కాలేజీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ పురుషోత్తం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరొక ప్రధాన అతిథి, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ.. నైపుణ్యం లేని విద్యార్హతలు, నాణ్యత లేని విద్యా విధానం నేటి తెలంగాణ అభివృద్ధికి ప్రధాన అడ్డంకులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కఠోర శ్రమతో వీటిని అధిగమించి సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సెమినార్ డైరెక్టర్, నిజాం కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'రూసా' (=ఖూసా) నిధుల సహకారంతో, సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా, అర్థశాస్త్ర విభాగం ఈ సెమినార్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సు కోసం అధిక సంఖ్యలో వొచ్చిన పరిశోధనా పత్రాల నుంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి, ఒక ప్రత్యేక పుస్తకాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మోహన్ రావు కీలక ఉపన్యాసం చేస్తూ.. దేశ ఆర్థిక వృద్ధి రేటును, ఉపాధి అవకాశాలను వివిధ సంవత్సరాలతో పోల్చి విశ్లేషించారు. వెనుకబడిన రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ సెమినార్‌లో గ్రామీణ వ్యవసాయం, పారిశ్రామిక మరియు ఆర్థికాభివృద్ధి అనే మూడు ప్రధాన అంశాలపై చర్చా వేదికలు జరిగాయి. ఈ సెషన్లలో సీనియర్ ఆచార్యులు ప్రొఫెసర్ ఐ. డేస్జి, ప్రొఫెసర్ నారాయణ, ప్రొఫెసర్ ఎం. రాములు, ప్రొఫెసర్ ఇంద్రకాంత్, ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి, ప్రొఫెసర్ రమణమూర్తి, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రమేష్, పాల్గొని విద్యార్థులకు, పరిశోధకులకు దిశానిర్దేశం చేశారు. ముగింపు (వ్యాలెడిక్టరీ) సమావేశంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ ఎల్.సి. మల్లయ్య మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం వేగంగా దూసుకుపోతోందని, విద్యార్థులు మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథంతో ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా సెమినార్ కన్వీనర్ డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ.. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలగరం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు మరియు నిర్వాహకులు డాక్టర్ సతీష్ రాయికింది, డాక్టర్ దుబ్బ రంజిత్, డాక్టర్ కే యుగంధర్, పి. సరిత, డాక్టర్ వెంకటరమణ, పి. వేణు, ఉజ్వల, డాక్టర్ రిజ్వానాతో పాటు వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విరామ సమయంలో అర్థశాస్త్ర విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# జనంపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 11:** జనం పెల్లి గ్రామంలో మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆదేశానుసారం టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ నూతన గ్రామ శాఖ పార్టీ కోసం హర్నిశలు కష్టపడాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దోపిడిని ప్రజలకు తెలియజేయాలని ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడాని ప్రజలకు వివరించాలని 6 గ్యారంటీలు ప్రజలకు అమలు చేస్తామని చెప్పి 420 హామీలు ఇచ్చి ఏ ఒక్కటి నెరవేర్చకుండా మోసం చేయడాన్ని ప్రజలకు వివరించాలని తెలియజేయడం జరిగింది. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది గ్రామ శాఖ అధ్యక్షునిగా నక్క నరేందర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా బీరం రాజిరెడ్డి, గట్టు రాములు ప్రధాన కార్యదర్శిగా సంఫీ ఐలయ్య కార్యదర్శిగా ఎర్ర బోయిన సత్తయ్య కోశాధికారిగా గట్టు శేఖర్ ఉపకోశాధికారిగా మల్లెబోయిన కృష్ణ మరియు అనుబంధ కమిటీలను కూడా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు. జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ ఉపేందర్ రెడ్డి నాయకులు కోళ్ల కిషన్ జనం పెల్లి ఉపసర్పంచ్ చొప్పరి నరసింహ వార్డు మెంబర్లు నక్క రాణి రాములు, నల్ల సైదులు రైతు విభాగం అధ్యక్షులు చొప్పరి లింగయ్య యువజన విభాగం అధ్యక్షులు సంగిశెట్టి శివాజీ సోషల్ మీడియా అధ్యక్షులుగా వంగాల నవీన్ నాయకులు సింగం రోశయ్య, సంగిశెట్టి నారాయణ, అనంతోజు అంజయ్య, వంగాల యాదయ్య, నోముల సైదులు, నక్క సత్తయ్య, కైరం కొండ గోవర్ధన్, నక్క మల్లయ్య, బైరు వెంకన్న, మెడబోయిన మహేష్, ఈష బోయిన బిక్షం,ఎర్రబోయిన గోపాల్, కొసని అంజయ్య, పండుగ ఐలయ్య, రేఖ సాయి, నక్క నవీన్, వంగాల సాయి, పండుగ వెంకన్న, పోషబోయిన నాగరాజు, పున్న శ్రీధర్, గట్టు ముత్తయ్య, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# అభినందన సభ




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 11:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట లో బుధవారం రోజున యువ ఆపదమిత్ర శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన సురేష్, మహేష్, చంద్రశేఖర్, సాయి, సమీర్, రేష్మ, భవాని,ఆసియా, భావన, మౌనిక మొదలగు విద్యార్థినీ విద్యార్థులను, బీహార్ లోని ససారంలో జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న సాయి తేజను , మరియు (మహాత్మా గాంధీ యూనివర్సిటీ నల్గొండ తరఫున )వారికి నాయకత్వం వహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తాటిశెట్టి శ్రీనివాసులును కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్కాణం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రహత్కాణం మాట్లాడుతూ., రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంట్ స్టడీస్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్) డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగినటువంటి యువ ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట కు చెందిన పదిమంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందివ్వడం. జరిగిందనీ, ఈ శిక్షణ కార్యక్రమంలో వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, సునామీలు, రోడ్డు ప్రమాదాలు తదితర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు క్షతగాత్రులను ఏ విధంగా కాపాడాలి. వారిని ఏ విధంగా సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. వారికి ప్రధమ చికిత్స ఏ విధంగా చేయాలి. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి సి.పి.ఆర్. (కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేసి ఏ విధంగా ప్రాణాలను రక్షించాలి, నీళ్లలో, పెద్దపెద్ద నదులలో పడినటువంటి వ్యక్తులను, జంతువులను ఏ విధంగా కాపాడాలి. బహులంతస్తుల భవనాల శిథిలాలలో చిక్కుకున్నటువంటి వారిని ర్యాప్లింగ్ (అసెండింగ్, డిసెండింగ్ ద్వారా వెళ్లి ఏ విధంగా కాపాడాలి. మొదలగు అంశాలపై పది రోజులపాటు శిక్షణను ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్, హైడ్రా బృందాల ద్వారా శిక్షణను ఇప్పించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ వచ్చిన విద్యార్థులకు గవర్నర్ విష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందివ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి వెంకటేశ్వర్ రావు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని ఎం. అనిత, డాక్టర్ కిషన్, డాక్టర్ రవీందర్ రావు, జి. నరేష్, ఏ. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట లో వ్యాయామశాల ఏర్పాటు చేయాలి



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 11:** ఈనెల 16న సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న రామన్నపేట ఆసుపత్రి 100 పడకల స్థాయికి పెంచాలని చేసే ఆమరణ నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని, అలాగే స్థానిక పాత నేతాజీ క్లబ్ ను పునరుద్ధరించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానిక క్రిస్టియన్ కాలనీలో జరిగిన ఇంటింటి సిపిఎం కార్యక్రమంలో రామన్నపేట మండల కార్యవర్గ సభ్యులు, కందుల హనుమంతు పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మించి నేటికీ 52 సం. రాలు అయ్యి శిథిలావస్థకు చేరిందని 22 మంది డాక్టర్లు ఉండాల్సిన చోట కేవలం ఇద్దరు ముగ్గురు తో కాలం వెళ్లబోస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పాత నేతాజీ క్లబ్ అన్యాక్రాంతం అవుతుంది అని దానిని పునరుద్ధరించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి పట్టణ యువకులకు సీనియర్ సిటిజన్స్ కి వ్యాయామశాల ఏర్పాటు చేస్తే ఉపయోగపడుతుందని అలాగే ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని పాలకులు ఇచ్చిన హామీ నెరవేర్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు గొరిగే సోములు, బావండ్లపల్లి బాలరాజు, బోళ్ళ వెంకన్న, పల్లె సత్యం, కడారి రాములు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మార్చి 11:**

# కమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అగ్నిప్రమాదం రూ.8 లక్షల ఆస్తి నష్టం!






**కాప్రా, మార్చి 11వెలుతురు:**
హైదరాబాద్ కాప్రా సర్కిల్ పరిధిలోని సౌత్ కమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించి కలకలం రేపింది. ఈ ఘటనలో కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్, పత్రాలు మరియు ఇతర సామగ్రి దగ్ధమై సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ నివాసితులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. వారి ప్రయత్నాలతో కొంతవరకు మంటలు తగ్గించగలిగారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తిగా మంటలను ఆర్పివేశారు. అసోసియేషన్ సభ్యుల వివరాల ప్రకారం, మధ్యాహ్నం సుమారు 12:30 గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నామని, అనంతరం ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు తెలిపారు. కార్యాలయంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకపోయినా ఈ ఘటన ఎలా జరిగిందనే విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ ఘటనతో కమలనగర్ కాలనీ వాసుల్లో ఆందోళన నెలకొంది. అధికారులు సంఘటనకు గల కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టనున్నట్లు సమాచారం.

# ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్.






**మంచిర్యాల జిల్లా వెలుతురు మార్చి 11 :**
ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్ ను నియమించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని చీరాల లో అంబేద్కర్ భవన్ లో జరిగిన హ్యూమన్ రైట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హ్యూమన్ రైట్స్ కు సంబంధించిన విషయాలపై చర్చ వేదిక నిర్వహించారు అనంతరం కొంతమందికి పదోన్నతులు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా హ్యూమన్ రైట్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీగా పవన్ కళ్యాణ్, కోఆర్డినేటర్ గా శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా శ్రీకాంత్, మంచిర్యాల జిల్లా ఉమెన్స్ వింగ్ సెక్రటరీగా మమతను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జనరల్ సోలమన్ రాజు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేసుకోకుండా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతూ, ప్రజల పక్షాన ప్రజల కోసం కృషి చేస్తామని తెలియజేశారు.

# తల్లిబిడ్డల ఆరోగ్యానికి మరో అడుగు ఇబ్రహీంపట్నం బస్ స్టాప్ లో పాలిచ్చే కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**- ఇది కేవలం కేంద్రం కాదు, ప్రజల కోసం చూపించే పరిపూర్ణ సేవా ప్రేమకు చిహ్నం**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 11:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ మాహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంబస్ స్టాప్ లొ ఏర్పాటు చేసిన మదర్ ఫిడింగ్ సెంటర్ ను ఇబ్రహీంపట్నంఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి ప్రారం భించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిమాట్లాడుతూతల్లి బిడ్డలఆరోగ్యం ఎంతో ముఖ్యమని ప్రజలకు అవసరమైన ప్రతిసౌకర్యాన్ని అందించేందుకు తాము ఎల్లప్పుడూ కృషి చే స్తామని తెలిపారు ప్రజలకు అవసరమైనా ప్రతిసౌకర్యం అందించడంమాద్యేయం తల్లులు మరి యు చిన్నపిల్లల కోసం ఈకేంద్రం అనివార్యం అని ఎమ్మెల్యే అన్నారు ఈకార్యక్రమంలో వివిధ శా ఖ అధికారులు ప్రజాప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" (రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం.




**కుత్బుల్లాపూర్ మార్చి 11 (వెలుతురు ప్రతినిధి):**
రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" (రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అంబెడ్కర్ నగర్‌లోని జామా మసీద్-ఎ-మొహమ్మదియా వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫాలు (దుస్తులు మరియు ఇతర నిత్యావసర వస్తువులు) పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం మరియు సేవా భావానికి ప్రతీక అని అన్నారు. పేద మరియు అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె .ఎమ్ గౌరీష్, డివిజన్ అధ్యక్షులు ఎండి .జాకీర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, మన్నే రాజు, బేకు శ్రీనివాస్, బుయ్యని శివ కుమార్, కయ్యూమ్, జెస్సి పాల్, ప్రదీప్, కుమార్, ప్రవీణ్, సురేందర్, రమేష్, అక్బర్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సుజాత, సుజాత యాదవ్, అరుణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యార్థం ముందడుగు వేసిన 2001 - 2002 బ్యాచ్

- 1 బీరువా బహుకరణ
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రకటన
- సీసీ కెమెరాలు ఏర్పాటు కు ప్రకటన
- అభినందించిన మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం










**మునుగోడు వెలుతురు మార్చి 11:**
మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 - 02 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలపై ఉన్న మమకారంతో పాఠశాలలో సౌకర్యార్థం పాఠశాలకు 1 బీరువా అందజేశారు..4 సీసీ కెమెరాలు ఏర్పాటు తోపాటు 2025 - 26 సంవత్సరంలో 10 వ తరగతిలో పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 12 వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి 7 వేల రూపాయలు,తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి 5 వేల రూపాయలు నగదు ప్రోత్సాహ బహుమతులు అందజేస్తామనీ ప్రకటించడం జరిగింది...ముక్య అతిథిగా మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం పాల్గొని మాట్లాడారు..చదివిన పాఠశాలను చదువు చెప్పిన గురువులను మరచిపోకుండా గుర్తుకు ఉంచుకొని పాఠశాల సౌకర్యార్థం ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం..ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్థికంగా బరోసా కల్పించడం అభినందనీయం అని,ప్రతి ఒక్కరు 2001 - 02 పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ ,ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందించి విద్యార్థులకు వెన్నంటి ఉండడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. పాఠశాల మనది మన అందరిదీ ప్రతి ఒక్కరు ఈ పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని,విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకోవడం జరుగుతుంది, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. క్రమశిక్షణతో ఉండి గురువులను గౌరవిస్తూ ,ప్రతి ఒక్కరు కష్టపడి చదివి పాఠశాలకు,గ్రామానికి, తల్లితండ్రులకు మంచి పేరు తేవాలని, ఉన్నత స్థాయిలో ఎదగాలని, భవిష్యత్ లో మీరు కూడా చదివిన పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు..పాఠశాల అభివృద్ధికి ఎప్పుడు తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో.2001 - 02 పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,కూరెళ్ళ జ్ఞానేశ్వర్,ఈద ప్రవీణ్,బొల్లు సైదులు,చెరుకు నరేందర్, ముచ్చపోతుల శ్రవణ్ కుమార్ నారగోని శ్రీశైలం,పాఠశాల చైర్మన్ పందుల ఎల్లమ్మ,పాఠశాల ఉపాధ్యాయులు కే సత్తిరెడ్డి,రత్నయ్య,అన్నపురెడ్డి, వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..

# సంచార జాతుల సమగ్ర సర్వే పుస్తకాన్ని ఆవిష్కరించిన మేయర్ కోలగని శ్రీనివాస్....



**కరీంనగర్ వెలుతురు మార్చి 11:**
సంచార జాతులు, సమగ్ర సర్వే, సంచార , అర్ధసంచార , విముక్త జాతుల ఆర్థిక సామాజిక స్థితిగతుల అధ్యయనంపై రూపొందించిన పుస్తకాన్ని బుధవారం రోజున కరీంనగర్లో మేయర్ కోలగని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే మొదటి సారి సంచార జాతుల పై తెలంగాణ లో సామాజిక సమరసతా వేదిక సమగ్ర సర్వే నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సామాజిక సమరత బాధ్యులు మాట్లాడుతూఅక్టోబర్ 26 నుండి డిసెంబర్ 31 వరకు తెలంగాణలోని 29 జిల్లాల్లో 33 తెగల వారిని సమరత కార్యకర్తలు కలిశారని, 1450 కుటుంబాల వద్దకు 70 మందికి పైగా సమరసతా కార్యకర్తలు వెళ్లి 7000 మందికి పైగా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారని తెలిపారు. ముఖ్యంగా ఈ సందర్భంగా ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక అంశాలతో పాటు 25 కి పైగా విషయాలను ప్రశ్నావళిగా రూపొందించడం జరిగిందన్నారు. వాటి ఆధారంగా సేకరించిన సమాధానాలతో పారదర్శకమైన గణంకాలతో మ్యాప్ లు,గ్రాఫ్స్ తో , 136 పేజీలతో కలర్ బొమ్మలతో కూడిన ఒక పుస్తకం ప్రచురించటం జరిగిందని వివరించారు. దీని వల్ల అటు ప్రభుత్వానికి,ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం,విశ్వ విద్యాలయాల కులపతులు,ఆచార్యులకు, సివిల్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు,ఇటు సేవా కార్యక్రమాలు చేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు,సామాజిక కార్యకర్తలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధానంగా స్వాతంత్ర్యం పొంది ఇన్నేళ్ళైనా సంచార జాతులు రాజ్యాంగ ఫలాలు అందక,బిక్కు బిక్కుమని బ్రతుకులు ఈడుస్తున్న దీన,దుఖితులు ఇంకా ఈ సమాజంలో వున్నారనే సత్యం అందరికీ బోధ పడుతుందన్నారు. పక్కా ఇళ్ళు,చదువు,వైద్యం, టాయిలెట్స్, విద్యుత్,ఉద్యోగాలు,మంచి నీళ్లు, ప్రభుత్వ పథకాలు,కుల సర్టిఫికెట్స్,ఆధార్ కార్డులు మొదలైనవి అందక జీవిస్తున్న ఈ వర్గాల వారి కోసం సమరసతా వేదిక అండగా నిలుస్తుందన్నారు. అటు పాలకులు ఇటు సభ్య సమాజం ఈ వర్గాల వారిని తోటి భారతీయులుగా భావించి,వారి అభ్యున్నతికి ఉపయోగపడే సూచనలు,సలహాలు అందించే విధంగా ఈ పుస్తకం తెలుగులో,ఇంగ్లీష్ భాషలలో ప్రచురించడం జరిగిందని తెలిపారు.ఇట్టి కార్యక్రమం లో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు, బోయిని పురుషోత్తం,కనికరం లక్ష్మణ్, ఉండేటిశ్రీకాంత్,దావు సంతోష్ కుమార్ సమరసత సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాల పెంపు, నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాం

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.**



**కుత్బుల్లాపూర్ మార్చి 11 (వెలుతురు ప్రతినిధి):**
బుధవారం 132 - జీడిమెట్ల డివిజన్ వైష్ణోయి ఎంక్లేవ్ లో 50.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన కాలనీ పార్కును బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి జీడిమెట్ల డివిజన్ తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణోయి ఎంక్లేవ్ అధ్యక్షులు రంగు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎంపీఆర్ చంద్రశేఖర్, కోశాధికారి రాకేష్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, అనిల్, నరేందర్ రెడ్డి, జయం చారి, సిల్వర్ పార్క్, అర్బానా, ఫ్రూట్స్ ఎంక్లేవ్, శ్రీని ఎన్క్లేవ్ తో పాటు పలు కాలనీలవాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ నగర్ కాలనీలో 60 ఫీట్ల రోడ్డుపై అక్రమ కబ్జాలు

**- చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి**







**శంకర్పల్లి వెలుతురు మార్చి 11 :**
శంకర్పల్లి పట్టణ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో 60 ఫీట్ల రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కాలనీ వాసి మరియు బీజేపీ మండల్ మహిళా అధ్యక్షురాలు గండేటి గాయత్రి గౌడ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం, శ్రీరామ్ నగర్ కాలనీలోకి ప్రవేశించే ప్రధాన రోడ్డుపై అనేక చోట్ల రోడ్డును ఆక్రమిస్తూ డబ్బాలు, షెడ్లు మరియు ఇతర నిర్మాణాలు నిర్మించారని పేర్కొన్నారు. ప్రవేశ ద్వారానికి సమీపంలో విజయ్ కుమార్ డీలర్, వెంకటయ్య డీలర్, భూపాల్ హోటల్ వద్ద రోడ్డుకు అడ్డంగా నాలుగు డబ్బాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మరోవైపు మీ సేవ భవనం వద్ద కూడా రోడ్డు ఆక్రమణ జరిగిందని చెప్పారు. అదేవిధంగా కాలనీలోని టర్నింగ్ వద్ద బుక్కయ్య గౌడ్ ప్లాట్ సమీపంలో ప్రీకాస్ట్ నిర్మాణం ద్వారా రోడ్డును కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. గోవర్ధన్ రెడ్డి ఇంటి మూల వద్ద కూడా రోడ్డుపైనే రెండు డబ్బాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్లోళ్ల శేఖర్ రెడ్డి భవనానికి చెందిన మెట్లు కూడా రోడ్డుపైనే నిర్మించారని ఆరోపించారు. ఫతేపురం ప్రాంతంలో ఉన్న ఒక భవనం కొంత భాగం రోడ్డులోకి వచ్చిందని, అలాగే కుమ్మరి రాములు భవనం కాంపౌండ్ వాల్ కూడా రోడ్డును ఆక్రమించిందని తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి భవనం పక్కన వెంచర్‌లో లేని ప్లాట్‌పై కూడా భవనం నిర్మించారని పేర్కొన్నారు. ఈ భవనం నిర్మాణంపై 2021 సంవత్సరంలోనే మున్సిపాలిటీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గాయత్రి గౌడ్ తెలిపారు. ఇంకా కాలనీలోని ఫుట్‌పాత్‌లను కూడా ఆక్రమించి జాలీలు నిర్మించారని, రోడ్డుపై కార్ షెడ్లు మరియు ఇళ్ల ముందు రేకుల షెడ్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. దీంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. శ్రీరామ్ నగర్ కాలనీ 11 ఎకరాల లేఅవుట్ ప్రకారం 60 ఫీట్ల రోడ్డులో ఉన్న అన్ని అక్రమ నిర్మాణాలను చట్టపరంగా తొలగించాలని, ఆక్రమణలను నివారించి కాలనీవాసులకు న్యాయం చేయాలని మున్సిపల్ అధికారులను గండేటి గాయత్రి గౌడ్ కోరారు. దీనికి సంబంధించిన ఫోటోలు మరియు ఫిర్యాదు ప్రతులను కూడా అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. కాలనీలో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


# నందిగామ మదీనా మసీద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్





**పఠాన్ చెరువు వెలుతురు మార్చి 11:**
హిందూ ముస్లిం సోదరభావానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలోని మదీనా మసీద్‌లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గోరె మియా గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాట శ్రీనివాస్ గౌడ్ ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షలు విరమించి, వారికి స్వయంగా భోజనం వడ్డించారు. రంజాన్ నెల ప్రేమ, సహనం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పవిత్ర సందర్భాన్ని సామాజిక ఐక్యతకు దోహదపడేలా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

# అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను సన్మానించిన టీజీఈజేఏసీ ప్రతినిధులు



**మేడ్చల్‌మల్కాజ్‌గిరి వెలుతురు మార్చి 11:**
మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (౧+జుజీూజ) ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ శ్రీ బి. రవి ప్రకాష్ గారి అధ్యక్షతన ప్రతినిధుల బృందం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ ఫైజాన్ అహ్మద్, ×ూూ గారిని సాదరంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు కార్మిక సంఘాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో సహకారం అందించాలని కోరారు. దీనిపై అదనపు కలెక్టర్ గారు సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. రవి ప్రకాష్ (చైర్మన్, ౧+జుజీూజ మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా), వై. రమేశ్వర్ గౌడ్ (అదనపు జనరల్ సెక్రటరీ), బి. వెంకటేశ్వర్లు (కోచైర్మన్), ఎం. మధన్ రెడ్డి, ఎం. విఠల్, ఎం. శ్రీనివాస్ (వైస్ చైర్మన్‌లు), బి. భారత్ కుమార్ (డిప్యూటీ సెక్రటరీ) యాదగిరి, మహేష్, శ్రీనివాస్, నాచారయ్య, శ్రీనివాస్(౧చీ+ూూ మల్కాజ్‌గిరి యూనిట్ సెక్రటరీ), కలెక్టర్ కార్యాలయ ౧చీ+ూూ అధ్యక్షుడు కార్తిక్, సెక్రటరీ అక్షయ్, ఉమాకాంత్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముదబ్బీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా 13 వ ఇఫ్తార్ విందు





**వనస్థలిపురం, మార్చి 11 (వెలుతురు):**
ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురంలోని గురుద్వార్ సమీపంలో బుధవారం నాడు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముదబ్బీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిధిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముదబ్బీర్ అలీఖాన్ మాట్లాడుతూ ...గత 13 సంవత్సరాల నుండి ఇఫ్తార్ విందును నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కుల,మత భేదాలను విస్మరించి సమాజంలో ఐక్యతను చాటడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బి.యన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న,డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింతల రవికుమార్,నాయకులు సంజయ్ ,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇఫ్తార్ విందు ను స్వీకరించారు.



తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని తెలంగాణ మినిస్టర్ క్వార్టర్స్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటై చైర్మన్‌గా శివానందం నియమితులైన నేపథ్యంలో, మంత్రి గారిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

**హైదరాబాద్ వెలుతురు మార్చి 11:**

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చ్ 11ను పునస్కరించుకొని వేడుకలు

**జహీరాబాద్ వెలుతురు మార్చి 11:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చ్ 11ను పునస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని పస్తా పూర్ డిడియస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ



సాంప్రదాయ పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకుని మహిళలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని అలాగే కుటుంబాలను కూడ ఆరోగ్యవంతంగా ఉంచడంలో ప్రముఖపాత్ర వహించాలని అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం కూడా మహిళలకు అన్నిరంగాల్లో అవకాశం ఇస్తుందని, వాటిని మహిళలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వృద్ధుల సంరక్షణ చట్టం, బాల్య వివాహ నిర్మూలన చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం పై క్లుప్తంగా వివరించారు. మహిళలు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంను సంప్రదించాలని, అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని సూచించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్స్, డిడియస్ ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ కార్యకలాపాల పురోగతి, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం




**రంగారెడ్డి వెలుతురు మార్చి 11:**
జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాల పురోగతి , వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలును సమీక్షించడానికి, కలెక్టర్ నారాయణ రెడ్డి సూచనల మేరకు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (LDM) రంగారెడ్డి జిల్లాకు చెందిన జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు, అదనపు కలెక్టర్ LB కె. శ్రీనివాస్ సర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అన్ని బ్యాంకులు, జిల్లా పరిపాలన, RBI , NABARD అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో, వివిధ రుణ పథకాల యొక్క వివరణాత్మక సమీక్ష, ముఖ్యంగా వ్యవసాయ అడ్వాన్సులు, MSME అడ్వాన్సులు మరియు విద్యా రుణాల పంపిణీల కింద పురోగతిని చేపట్టారు. MSME యూనిట్లు మరియు విద్యార్థులకు క్రెడిట్‌ను అందించడంలో ఎదురయ్యే సమస్యలను వివరంగా చర్చించారు మరియు క్రెడిట్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికి మరియు అర్హత కలిగిన రుణాల సకాలంలో మంజూరు మరియు పంపిణీని నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు సూచించారు. జిల్లాలో ఆర్థిక చేరికను పెంచడానికి మరియు ఆర్థిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి బ్యాంకులు మరియు ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ ప్రయత్నాలను చైర్మన్ నొక్కి చెప్పారు. రుణ ప్రాసెసింగ్‌ను క్రమబద్ధీకరించడానికి మరియు క్రెడిట్ డెలివరీలో అడ్డంకులను పరిష్కరించడానికి చర్యలు కూడా చర్చించబడ్డాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా యొక్క సంభావ్య క్రెడిట్ ప్రణాళికను కూడా సమావేశంలో ఆవిష్కరించారు.

## మంచాల మండలం వివిధ గ్రామాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**- ప్రజాపాలనలో ప్రజల వద్దకే ప్రజలు గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



మంచాలలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఉపసర్పంచ్ పందుల లింగం గౌడ్

**మంచాల వెలుతురు మార్చి 11:**
మంచాల మండలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రో జుల కార్యక్రమంలో భాగంగా మంచాల మండలం లింగంపల్లి తాళ్లపల్లిగూడా చిత్తాపూర్ జాపాల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డిరంగా





రెడ్డి అనంతరం మండల కేంద్రంలోని మంచాల గ్రామపంచాయతీ పాలకమండలి గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభలో పాల్గొ న్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సభలో పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన గ్రామా ల ప్రజలు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా సమస్యలు పరిష్కరించాలని చెప్పారు ముఖ్యంగా వేసవికాలం మొ దలైంది తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ఇప్పటి వరకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు పూర్తి అయితే ఏప్రిల్ నెలలో మరిన్ని ఇందిర మ్మ ఇల్లు మంజూరు చేయిస్తాను అని అన్నారు ప్రజాపాలలో అధికారులే ప్రజల వద్దకు వచ్చి స మస్యలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలన అని అ న్నారు అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైన సమస్యలు పరిష్కరించడానికి పార్టీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు ఈసీ శేఖర్ గౌడ్ మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్ సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మంచాల మండలం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎద్మ నరేందర్ రెడ్డి మాజీ డైరెక్ట ర్లు వింజమూరి ప్రేమకర్ రెడ్డి జెనిగే వెంకటేష్ యాదవ్ విజమూరి రాంరెడ్డి సర్పంచ్ లు సంజీ వరెడ్డి రాంరెడ్డి మానస విన య్ రమేష్ మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి జిలమోని సత్త య్య ముదిరాజ్ బైరిక రమాకాంత్ రెడ్డి చీమల జంగయ్యయాదవ్ మాజీ ఎంపీటీసీ రాందాస్ మంచాల ఉప సర్పంచ్ పందుల లింగంగౌడ్ అధికారులు మంచాల ఎంపీడీవో అధి కారి అన్నా రం బాల శంకర్ తహసిల్దార్ వెంకట వరప్రసాదరావు ఏపిఎం శేఖర్ గౌడ్, మంచాల ఏఈ మల్లారె డ్డి పోలీస్ స్టేషన్ సిఐ మధు వివిధ శాఖ అధికారులు వివిధ గ్రామాల వార్డు సభ్యులు తదితరు లు పాల్గొన్నారు

## మంఖాల్-2 ను సందర్శించిన మేనేజింగ్ డైరెక్టర్ హౌసింగ్ , కార్యదర్శి, ఎం. చైతన్య కుమార్





**రంగారెడ్డి వెలుతురు మార్చి 11:**
వి.పి.గౌతమ్ ఐ.ఎ.ఎస్ , మేనేజింగ్ డైరెక్టర్ హౌసింగ్ , కార్యదర్శి, ఎం. చైతన్య కుమార్ , చీఫ్ ఇంజనీర్ హౌసింగ్, డి. చంప్లా నాయక్ , పిడి హౌసింగ్ రంగారెడ్డి, పి. బలరామ్ , విజిలెన్స్ అధికారి మంఖాల్-2 ను సందర్శించారు. స్థానిక మరియు సమీప ప్రాంతాల నుండి శంషాబాద్ సర్కిల్ వరకు ూ2 నుండి లబ్ధిదారుల ధృవీకరణ మరియు కేటాయింపును పూర్తి చేయాలని , మంఖాల్-2 మరియు ఇతర పెద్ద 2దీఎఖ కాలనీలలో ాాజు కార్యాలయాన్ని నియమించాలని ఆదేశించారు. రెండు నెలల్లో అన్నింటినీ ఆక్రమించాలని కూడా ఆదేశించారు. మంఖాల్-2 లోని ూూ అవుట్‌లెట్ యొక్క పెండింగ్ పనులను కూడా చేపట్టాలని ఆదేశించారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం

**- ఇద్దరు పంచాయితీ కార్యదర్శులు సస్పెన్షన్**

**రంగారెడ్డి,మార్చి11( వెలుతురు):**
రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' అమలులో అలసత్వం వహించిన అధికారులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సంబంధిత సిబ్బందిపై వేటు వేశారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో విఫలమైన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫరూక్ నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. సరోజపై ఈ చర్యలు తీసుకున్నారు. పై అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండానే విధులకు గైర్హాజరు కావడం, కార్యాలయ రికార్డుల నిర్వహణలో అస్తవ్యస్తంగా వ్యవహరించడం ఆమె సస్పెన్షన్‌కు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఇదే మండలంలోని కాశిరెడ్డి గూడ పంచాయతీ కార్యదర్శి కె. వాసవాచారి కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. ప్రజా పాలన లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవ్వడం, రోజువారీ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయడంతో ఆయనపై కూడా వేటు పడింది. ఈ నెల 9వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి (డిపివో) సురేష్




మోహన్ ఫరూక్ నగర్ మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పనుల తీరును పరిశీలించిన ఆయన పలు లోపాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగానే క్రమశిక్షణా చర్యలు అమలయ్యాయి. కేవలం కార్యదర్శులనే కాకుండా.. పర్యవేక్షణలో విఫలమైన ఉన్నతాధికారులను కూడా కలెక్టర్ వదలలేదు. మండలంలోని కార్యదర్శులకు సరైన దిశానిర్దేశర చేయడంలో విఫలమైన ఫరూక్ నగర్ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) ఎం. జయంత్ రెడ్డికి ఛార్జ్ మెమో జారీ చేశారు. కందుకూరు మండలంలోని కందుకూరు, ముచ్చర్ల, కొత్తగూడ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను కార్యదర్శులు ఇంద్రసేన రెడ్డి, శ్రీహరి, నరేందర్ గౌడ్లకు డీపీఓ షోకాజ్ నోటీసులు అందజేశారు.

## ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి

**- 374 కోట్ల రూపాయల నిధులు**

**హైదరాబాద్,మార్చి11( వెలుతురు):**
పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్స్ క్రింద ఎస్సీ విద్యార్థులకు బోధనా రుసుములు మరియు మెయింటెనెన్స్ చార్జీలను 2024-25 సంవత్సరం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో చెల్లిస్తున్నాయన్న విషయమూ, అట్టి సొమ్ము విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరంలో ఇప్పటికి రూ. 374.00 కోట్ల నిధులు, రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 83239 మంది ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడమైనది. ఇందులో రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద రూ.173.00 కోట్లు విడుదల చేయగా కేంద్రప్రభుత్వం రూ. 201.00 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులు తమకు చెందిన మెయింటెనెన్స్ అమౌంట్ ను మినహాయించుకుని, బోధానా రుసుమును (ట్యూషన్ ఫీజు) ఇతరేతర రుసుములను కళాశాలకు చెల్లించాల్సి ఉంటుంది. ఉపకారవేతన నిధులు జమ చేయబడిన విద్యార్థుల వివరాలు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ఈ-పాస్ లాగిన్స్ లో పొందుపరచడం కూడా జరిగిందని తెలియజేస్తున్నాం. నిధులను విడుదల చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉపముఖ్యమంత్రివర్యులు ఆర్థిక శాఖామాత్యులు భట్టి విక్రమార్క రికి ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నిధుల విడుదలకై విశేషమైన కృషి చేసిన ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఎస్సీ విద్యార్థులందరూ మనస్ఫూర్తిగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చాం. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తాం. గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ ఛార్జీల భారం వేస్తే.. మేం ట్రూడౌన్ చేశాం. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం అని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టి ప్రభుత్వ విధానాలపై క్లారిటీ ఇస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్, గుడ్ గవర్నెన్స్ బ్యాలెన్సింగ్ చాలా అవసరమని చెప్పారు. వర్చువల్, ఫిజికల్ వర్కింగ్ ఈరోజు రియాలిటీగా మారుతోందని సీఎం అన్నారు. 'పర్వాలేదు' అనే ఉదాసీనత కూడా చేయాల్సిన పనులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. గతంలో విజన్ 2020 పెట్టినప్పుడు చాలామంది విమర్శించారని.. ఇప్పుడు అది ఫలితాన్ని ఇవ్వడంతో 2047వైపు అందరూ చూస్తున్నారని సీఎం అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో నిర్ధిష్టమైన టార్గెట్‌లను ఫిక్స్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈసారి 15 పాయింట్లను ఈ ఏడాది లక్ష్యాల కింద ఇస్తున్నట్లు చెప్పారు. 20 నెలల్లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని అన్నారు. ఏ సంక్షేమ కార్యక్రమం ఎప్పుడు చేస్తామో ముందే చెబుతామని.. దానికి తగ్గ ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ నెలలో 13వ 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు సీఎం. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్మును జమ చేస్తుందన్నారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులతో కలిసి 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్దామని సీఎం తెలిపారు. ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే ప్రిపరేటరీ వర్క్ చేయాలని సీఎం సూచించారు. మే 15న నీటిని విడుదల చేస్తున్నామని, ఈ సీజన్లో ముందుగానే నీరు ఇస్తామన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు 'ఇంద్రధనస్సు' పేరుతో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. చరిత్రలోనే తొలిసారి విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీలను ప్రవేశపెట్టామని.. వినియోగ దారులకు బెనిఫిట్ వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యుత్ చార్జీలను 39 పైసలు తగ్గిస్తున్నామని.. తద్వరా వినియోగదారులపై భారం భారీగా తగ్గనుందన్నారు. 6 లక్షల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలనేది టా÷-గ్గ÷ట్‌గా పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని నిర్ణయించామని సీఎం అన్నారు. అయితే ఏడాదిలోనే లక్షా 15వేల మందిని తయారు చేశామన్నారు. ఈ ఏడాది 5 లక్షల మందిని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎస్టోనియా, ఇజ్రాయిల్, సింగపూర్‌లు ఎంట్రపెన్యూర్‌లను తీసుకువచ్చారని.. ఏపీలో కూడా ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పినట్టు అగ్రిటెక్ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా తేవాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పాదన ఓ సంపాదనా మార్గంగా మారాలని సీఎం చంద్రబాబు అన్నారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటప్రెన్యూర్ కింద 1.12 లక్షల మంది మహిళా మైక్రో ఎంటప్రెన్యూర్‌లు తయారయ్యారని తెలిపారు. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదామని.. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ వ్యవసాయదారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. సమర్ధ నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశమని.. నీటి భద్రత కోసం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్ల మేర భూగర్భజలాలు గడిచిన రెండు నెలల్లో పెరిగాయన్నారు. మార్చి 1 నాటికి 8.10 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయని వెల్లడించారు. 90 రోజుల పాటు ఏప్రిల్ 1 నుంచి జూన్ నెలాఖరు వరకూ నీటి సంరక్షణా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. నో సబ్ మె÷-జ్గ÷న్స్ విధానంలో కాలువల పూడికలు, చెరువుల లింకేజి లాంటి కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 614 టీఎంసీల నీళ్లు రిజర్వాయర్లలో ఉన్నాయని సీఎం అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాగు సీజన్‌ను ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. భూగర్భ జలాలు పెరిగితే ప్రభుత్వం ఇస్తున్న రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సిడీలు భారం తగ్గుతుందన్నారు. వెలిగొండను జూలై నాటికి పూర్తి చేసి నీటిని ఇస్తామని... 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్ట్‌ను 2027లో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులు ప్రాధాన్యం క్రమంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కడా భూ వివాదాలు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. పిటిషన్ కల్చర్‌ను తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. వాస్తవాలన్నీ పోర్టల్లో పెడితే వివాదాలు తగ్గుతాయన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం కావాలని... అకౌంటబిలిటీ ఫిక్స్ చేయాలని తెలిపారు. భూ వివాదాలు లేకపోతే 70 శాతం సమస్యలు తగ్గుతాయని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, మంత్రులు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

- కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్



**హైదరాబాద్, మార్చి11( వెలుతురు):** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు.. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్‌చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని కేటీఆర్ అభివర్ణించారు. ఇది కేవలం తీర్పు కాదు.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థను ఉపయోగించే ఉదాహరణ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను లాభాల కోసం మార్చుకుంటే.. స్పీకర్ దానికి ఆమోద ముద్ర వేస్తే.. ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసానికి దెబ్బ అని అన్నారు.

# విపక్ష నేతకే మాట్లాడే అవకాశం ఇవ్వరా ?

- లోక్‌సభ చర్చలో ఎంపి మల్లు రవి



**న్యూఢిల్లీ, మార్చి11( వెలుతురు):** లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తీరుపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం న్యూఢిల్లీలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా లోక్ సభలో ఎంపీ మల్లు రవి మాట్లాడారు. పార్లమెంట్ సంస్థలు పార్టీల రాజకీయాలను మించి ఉండాలని అభిప్రాయపడ్డారు. సభలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వ లేదని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల స్వరాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.స్పీకర్ పదవి రాజకీయాలకు అతీతంగా ఉండాలని ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. మహిళా ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా ఎంపీల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలపై ఉన్న సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు లేవనెత్తినందుకే సదరు ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలను ఎంపీ మల్లు రవి ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటూ పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 14ను బ్లాక్ డే అనడం తప్పు అంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.


# అవినీతి డిఎంకెను సాగనంపాల్సిందే

- తమిళనాడు అభివృద్ధి కోసం వేలకోట్ల నిధుల వెచ్చింపు
- తిరుచారపల్లి సభలో ప్రధాని మోడీ

**తిరుచిరాపల్లి, మార్చి11( వెలుతురు):** తమిళనాడులో కేంద్రం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోందని, ఇదే విషయం గతంలోనూ తాను చెప్పడం జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అవినీతి డీఎంకే పాలనకు ఉద్వాసన పలకాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తిరుచిరాపల్లిలో బుధవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. 'గత పర్యాయం తిరుచ్చి వచ్చాను. అప్పుడు రూ.20,000 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించాను. కొద్దిరోజుల క్రితం మదురైలో పర్యటించాను. రూ.4,400 కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టాం. ఈరోజు రూ.5,600 కోట్ల ప్రాజెక్టులకు సంబంధించిన ప్రోగ్రాం కోసం వచ్చాను. తమిళనాడు ఉజ్వల భవిష్యత్తు కోసం ఎన్నో పెట్టుబడులు పెడుతున్నాం. వీటిలో క్లీన్ ఎనర్జీ, మ్యాన్యుఫ్యాక్చరింగ్, హైవేలు, రైల్వేలు, గ్రామీణ రోడ్లు వంటి కీలక రంగాలు ఉన్నాయి. వీటి వల్ల వేలాది మంది యువతకు కొత్తగా ఉద్యోగాలు వస్తాయి' అని మోదీ తెలిపారు. తమిళనాడులోని అధికార డీఎంకే ప్రభుత్వంపై మోదీ విమర్శలు గుప్పించారు. స్టాలిన్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉద్దేశించిన నిధులు దారిమళ్లిస్తున్నారని, ఒక కుటుంబానికి లబ్ది చేకూర్చేందుకు ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలను డబ్బులకు అమ్ముకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. డీఎంకేను గద్దె దింపేందుకు రాష్ట్ర ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. మదురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందని, తద్వారా ఇప్పుడు యావత్ ప్రపంచం మదురై ముంగిట వాలుతుందని అన్నారు. రాష్ట్రంలోనే అతి పురాతన విమానాశ్రయాల్లో ఇది ఒకటని, దక్షిణ తమిళనాడుకు గేట్‌వే అని ప్రశంసించారు. మదురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించడం వల్ల ప్రపంచం మొత్తానికి మదురై గొప్పతనం తేలతెల్లమవుతుందని అన్నారు. కాగా, దీనికి ముందు, బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేరళలోని ఎర్నాకుళంలో జరిగిన ర్యాలీ, రోడ్‌షోలో ప్రధాని పాల్గొన్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం, మార్చి11( వెలుతురు):** ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిధి నకిరిపేట పరిధిలోని దోమలవాగుకు సీతారామ ప్రాజెక్టు నీటిని ప్రత్యేక పూజలు నిర్వహించి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నకిరిపేట పరిధిలోని దోమలవాగు ఈ ప్రాంత రైతులకు జీవనాధారంగా ఉందని, దోమలవాగుకు రూ.186 కోట్లు వెచ్చించి త్వరలో మినీ రిజర్వాయర్ చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం దోమలవాగు పరిధిలో 600 నుండి 800 ఎకరాలకు సాగునీరు అందుతుండటంతో రైతులు పంటలు ఎండిపోకుండా కాపాడుకున్నట్లయిందన్నారు. దోమలవాగు మినీ రిజర్వాయర్ అయితే 2 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రెండు పంటలకు డోకా ఉండదన్నారు. సాగునీరు సకాలంలో అందితే వరిసాగుతో పాటు ఆకుకూరలు, కూరగాయల సాగు కూడా చేపట్టవచ్చని తెలిపారు. అనంతరం నకిరిపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర విషయాలపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, వారికి నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, సీతారామ ప్రాజెక్టు ఈఈ తెల్లం వెంకటేశ్వరరావు, ఏఈ గణెళిషానాయక్, నకిరిపేట సర్పంచ్ సర్పా నాగమణి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, భజన సతీష్, ప్రసాద్, ఇంగువ రమేష్, బాదం రమేశ్రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

# ఎల్‌బీ స్టేడియంలో 15న రంజాన్ ఇఫ్తార్ విందు

- దావత్-ఎ-ఇఫ్తార్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం
- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్



**హైదరాబాద్, మార్చి11( వెలుతురు):** రంజాన్ ఇఫ్తార్ ఏర్పాట్లను వేగవంతంగా చేపట్టి నిర్దేశించిన సమయానికి అందించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అధికారులను ఆదేశించారు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 15న ఎల్‌బీ స్టేడియంలో దావత్–ఎ–ఇఫ్తార్ కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిలతో కలిసి మంత్రి వివిధ శాఖల అధికారులతో ఎల్‌బీ స్టేడియంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది తన మొదటి రంజాన్ దావత్–ఎ–ఇఫ్తార్ కార్యక్రమమని, దీనిని ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సహకారం, సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమానికి భద్రతా ఏర్పాట్లు, ఆహార భద్రతా ప్రమాణాలు, సరిపడా ఆహార సరఫరా, తగిన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ఇతర ప్రముఖులతో కలిసి మంత్రి శాఖల వారిగా చేపట్టబోయే ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశర చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కమిషన్ చైర్మన్లు, సభ్యులు మరియు మతపెద్దలు ఈ వేడుకలకు హాజరుకానున్నారని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఇఫ్తార్ కు సుమారు పదివేల మంది పాల్గొనే అవకాశం ఉందని ఆ దిశగా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యంగా ప్రోటోకాల్ తప్పక పాటించాలని సూచించారు. గత క్రిస్మస్ డిన్నర్ సందర్భంగా ఎల్బీ స్టేడియంలో వివిధ శాఖలు సమన్వయంతో చేసిన సమర్థవంతమైన ఏర్పాట్లకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, అదే ఉత్సాహంతో పని చేయాలని అధికారులకు సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లను మరింత మెరుగ్గా ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు . పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పార్కింగ్ సౌకర్యం, ట్రాఫిక్ మళ్లింపు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఆర్ అండ్ బి శాఖ స్టేజి, గ్యాలరీలు, బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇఫ్తార్ వేడుకలకు వచ్చేవారికి ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నం కాకుండా సరిపడా ఆహార కౌంటర్లు, తగిన సంఖ్యలో సర్వర్లు, త్రాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . అలాగే నాణ్యత ప్రమాణాలతో ఆహార పదార్థాలు ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ఆహార భద్రత పరీక్షలు చేపట్టాలని అలాగే వంటలు చేసే ప్రాంతంలో పరిశుభ్రత కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇఫ్తార్ సందర్భంగా ముందుగా ఎల్బీ స్టేడియం మొత్తం ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు ఉండేలా చూడాలని అలాగే సౌండ్ ప్రూఫ్ జనరేటర్ ని కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డయాస్ ను పూల అలంకరణతో చేపట్టి , మొక్కలు, కుండీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మెడికల్ శిబిరాలు ఏర్పాటుతో పాటు వైద్యులు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక శాఖ వంట, క్యాటరింగ్ ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా ÷ర్ టెండర్లు , సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. సమాచార శాఖ ద్వారా ఎల్‌ఈడి స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు కార్యక్రమానికి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనార్టీస్ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని, ప్రొఫెసర్ ఎస్.ఎ. షుకూర్, అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, ఖైరతాబాద్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శిల్పావల్లి, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జి.వి. నారాయణరావు, సమాచార శాఖ అదనపు సంచాలకులు జగన్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాధాకృష్ణ, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాములు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్ బాబు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, ÷రిళీలీస్, జీహెచ్ఎంసీ, మైనార్టీ శాఖ, ఆర్ అండ్ బి, వాటర్ సప్లై, విద్యుత్, అగ్నిమాపక, ఉద్యాన, వైద్య , సమాచార శాఖ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రాను అప్పులకుప్ప చేసారు

- ఆదాయం తగ్గింది...అప్పులు పెరిగాయి
- పెట్టుబడుల పేరుతో మభ్య పెడుతున్నారు
- అప్పులు రూ.81,071 కోట్లని తేల్చిచెప్పిన కాగ్
- మీడియా సమావేశంలో బాబు పాలనపై జగన్ విమర్శలు



**అమరావతి, మార్చి11( వెలుతురు):** చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి రాబడులు తగ్గాయని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయం తగ్గింది.. అప్పులు పెరిగాయన్నారు. తాను చెప్పిన విషయాలనే కాగ్ రిపోర్టు చెప్పింది అని అన్నారు. 2023–2024లో ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.2,36,486 కోట్లు అని తెలిపారు. 2023–2024లో రాబడులు రూ.1,70,767 కోట్లు, చంద్రబాబు వచ్చాక తొలి ఏడాది ఖర్చు రూ.2,49,906 కోట్లు అని, రాబడులు రూ.1,68,024 కోట్లు మాత్రమేనన్నారు. వైసిపి మీద తప్పుడు ప్రచారాలు చేస్తూ మరోవైపు ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్నారని, చేస్తున్న అప్పుల్ని బయటకు రానీయకుండా దాచేసే ప్రయత్నం చేస్తున్నారు అని చెప్పారు. 2024–25లో చేసిన బడ్జెట్ అప్పులు రూ.60,485 కోట్లని వీళ్ల ప్రభుత్వం చెబుతోందని, కాని కాగ్ మాత్రం ఆ ఏడాదిలో చేసిన అప్పులు రూ.81,071 కోట్లని తేల్చిచెప్పింది అని వైఎస్.జగన్ అన్నారు. చంద్రబాబు హయాంలో రెవిన్యూ లోటు రూ.60,285కోట్లు అని అన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గింది, ఖర్చులు పెరిగాయని విమర్శించారు. సిఎం చంద్రబాబు వచ్చాక రెవిన్యూ లోటు 56 శాతం పెరిగిందన్నారు. రాబడులు తగ్గాయని, ద్రవ్య లోటు 30 శాతం పెరిగిందని తెలిపారు. కోవిడ్ ఉన్నా.. ఆదాయాలు తగ్గినా తాము హామీలు నెరవేర్చామని కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు అమాంతం పెంచారని ధ్వజమెత్తారు. నెట్ బారో సీలింగ్ పరిధి దాటిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత వరకు అప్పు తీసుకోవచ్చో కేంద్ర ప్రభుత్వం విధించే ఆ పరిమితి నెట్ బారో సీలింగ్ పరిధి దాటిందని చెప్పారు. చంద్రబాబు అండ్ కో దోచిపెట్టడమే సరిపోతుందని ఎద్దేవా చేశారు. మట్టిని, ఇసుక, భూములు, లిక్కర్ దేన్ని వదలడం లేదు అని ఆరోపించారు. అన్నింట్లో దోపిడీయేనన్నారు. ప్రభుత్వానికి ఆదాయానికి ఎలా వస్తుంది, ప్రజలకు సంక్షేమం ఎలా అందుతుంది, వీళ్ల దోపిడికి వైజాగ్‌లో జరిగిన భూదోపిడీయే నిదర్శనం అని అన్నారు. ఓవైపు తమపై తప్పుడు ప్రచారాలు చేస్తారని మండిపడ్డారు. అప్పులు చేస్తారు ? ఆ అప్పులు బయట పడకుండా దాచేసే ప్రయత్నం చేస్తారు అని నిప్పులుచెరిగారు. కాగ్ రిపోర్టులో అప్పులు రూ.81,082.51 కోట్లు, కానీ అసెంబ్లీలో రూ.60,485.40 కోట్లు ఉందన్నారు. సుమారు రూ.20 వేల కోట్లు వ్యత్యాసం ఉంది అని అన్నారు. 16 రోజుల అసెంబ్లీ సమావేశాలతో ప్రజలు ఒరిగింది సున్నా అని విమర్శించారు. 2024–25లోనే పరిమితికి మించి రూ.17,953 కోట్లు అధికంగా అప్పులు తీసుకువచ్చారని? ఇక 2025–26 ఏడాదిలో పరిస్థితి ఇంతకన్నా కూడా ఘోరంగా ఉంది అని చెప్పారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు తెచ్చిన మొత్తం అప్పులు రూ.3.2 లక్షల కోట్లు అని అన్నారు. తమ హయాంలో చేసిన అప్పుల్లో 96 శాతం అప్పులు ఈ రెండేళ్లలోనే చేశారు అని తెలిపారు. తమ ఐదేళ్ల కాలంలో చేసిన అప్పులు కేవలం రూ.3.31 లక్షల కోట్లు మాత్రమేనన్నారు. ఎవరు జాగ్రత్తగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించారు, ఎవరు ఆర్థిక వ్యవస్థను డ్యామేజ్ చేశారన్నది కళ్లకు కట్టినట్టు కనిపిస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడంలేదు అని చెప్పారు. విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతి, దోపిడీ కారణంగా రాష్ట్రానికి ఆదాయాలు రావడం లేదు అని అన్నారు. వనరులన్నింటినీ కూడా దోచేసి సొంత జేబులు నింపుకుంటున్నారు అని దుమ్మెత్తిపోశారు. ఇసుక, మట్టి, సిలికా, క్వార్ట్జ్, లెటరైట్, గ్రానైట్, లిక్కర్, భూములు, అధిక రేట్లకు పీపీఏలు దేన్నీ వదిలిపెట్టడంలేదు అని చెప్పారు. దోపిడీ జరిగితే, ప్రభుత్వానికి ఆదాయాలు ఎలా వస్తాయి ? సంక్షేమం, అభివఅద్ధి ఎలా నడుస్తుంది ? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో అత్యంత విలువైన భూములను కారుచవకగా కట్టబెడుతూ దోపిడీకి పాల్పడుతున్నారు అని ఆరోపించారు. రూ.5 వేల కోట్ల విలువ చేసే 54 ఎకరాల ప్రభుత్వ భూములను చంద్రబాబు బంధువు కబ్జాచేస్తున్నారు అని జగన్ ఆరోపించారు. ప్రొ÷–లకెయిన్‌లతో లెవల్ చేసి, ప్రభుత్వం పెట్టిన బోర్డులను పీకేసి ఆక్రమించు కుంటున్నారు అని అన్నారు. ఇంత బహిరంగంగా ఒక ముఖ్యమంత్రి, ఆయన బంధువు, లోక్‌సభ ఎంపీ కలిసి ప్రజల ఆస్తులను దోచేస్తున్నారు అని చెప్పారు. ప్రభుత్వంతోపాటు వ్యవస్థలన్నీ చోద్యం చూస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను రాబందుల్లా కొల్లగొడుతున్నారు అని ధ్వజమెత్తారు. ఆర్‌బీఐ అడ్వాన్స్‌లమీద ఆధారపడకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో,మినిమం బ్యాలెన్స్ నగదు నిల్వ ఉండే రోజులు పడిపోయాయన్నారు. ఏ కష్టాలు లేనప్పటికీ 2024–25లో నగదు నిల్వలున్న సమయం కేవలం 8 రోజులకు పడిపోయిందన్నారు. 365 రోజుల్లో 357 రోజులు మినిమం బ్యాలెన్స్ కూడా ట్రెజరీల్లో లేవు అని చెప్పారు.

# మార్చి నెల నుంచే రైతు భరోసా నిధుల జమ

- మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటన




**మంచిర్యాల, మార్చి11( వెలుతురు):** తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్న రైతులకు శుభవార్త .మార్చి నెల నుంచే రైతు భరోసా నిధులను జమ చేయనున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ.. మొత్తం 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి వివరించారు. దీనిని రెండు విడతల్లో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్చి నెలాఖరులోగా రూ. 4,500 కోట్లు.. మిగిలిన నిధులను ఏప్రిల్ నెలలో జమ చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని.. సన్న వడ్లు పండించే 90 శాతం రైతులకు ప్రభుత్వం బోనస్ అందిస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐకేపీ, డీసీఎంఎస్ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీలపై ఉందన్నారు.గత ప్రభుత్వ తీరును విమర్శిస్తూ.. కమిషన్ల కోసమే ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరాన్ని తెరపైకి తెచ్చారని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల స్థానిక రైతులు పంట నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకా వెంకటస్వామి హయాంలోనే ప్రాణహిత ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు ఖర్చు చేసిందని ఆయన గుర్తు చేశారు. చెన్నూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ, వైస్ చైర్మన్‌గా పాపిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గం రైతుల ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు.మొత్తం రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేస్తామని చెప్పారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ గా మహేశ్ ప్రసాద్ తివారీ, వైస్ చైర్మన్ పాపిరెడ్డి, మరికొందరు డైరెక్టర్లుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు నెలల్లో మొత్తం రైతు భరోసా ఇవ్వనున్నట్లు వి వరించారు. మార్చి నెలలో రూ.4,500 కోట్లు, మిగితావి ఏప్రిల్ లో ఇస్తామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం సన్నబియ్యం పంపిణి చేస్తున్నా మని, సన్నవడ్లు పండించే 90 శాతం రైతులకు బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల ప్రయో జనాల కోసం సర్కార్ కట్టుబడి పనిచేస్తుందన్నా రు. రైతుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషిచేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవ సరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. డీసీఎంఎస్, ఐకేపీ సెంటర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీదేనని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకట స్వామి ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టు కోసం కృషి చేశారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజె క్టు కోసం రూ.11 వేల కోట్లను ఖర్చు చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాణహిత – చేవేళ్ల ప్రాజెక్టుకు బదులు కాళేశ్వరం ప్రాజెక్టు తీసుకు వచ్చిందన్నారు. కమిషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం కట్టిన ప్రా జెక్టులో కాళేశ్వరం బ్యాక్వాటర్ వల్ల నియోజక వర్గ రైతుల పంటలు మునిగిపోయి నష్టపోయారన్నారు.

# తిరుమలపై అనకొండలను పంపిస్తున్న జగన్

- ఆదిశేషుడి ముందు అనకొండలు ఏమీ చేయలేవు
- ఆనాడే పరకామణి చోరీ కేసును ఎందుకు తొక్కి పెట్టారు
- కమిషన్లు తీసుకోలేదని కాణిపాకంలో ప్రమాణం చేస్తారా
- మాజీ టిటిడి ఛైర్మన్ భూమనకు భానుప్రకాశ్ సవాల్



**తిరుపతి, మార్చి11( వెలుతురు):**

తాడేపల్లి ఆదేవాలతో తిరుమలపై అసత్య ప్రచారాలకు పాల్పడతున్నారని, తిరుమలను లక్ష్యంగా చేసుకుని వైకాపా నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిలో ఉన్న జగన్.. ఏడుకొండలపైకి అనకొండలను పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని అనకొండలు వచ్చినా ఆదిశేషుడి ముందు తోక ఆడించలేరని మండిపడ్డారు. 11 నెలల క్రితం జరిగిన ఘటనను నిన్న జరిగినట్లుగా కరుణాకర్ రెడ్డి నానా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పరకామణిలో చోరీకి యత్నించినప్పుడు పెంచలయ్య అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని మేం జైలుకు పంపాం. గతంలో రవికుమార్ దొరికితే మీరేం చేశారు? వాటాలు పంచుకుంది మీరు కాదా? విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ద్వారా రవికుమార్ విజువల్స్‌ను మాయం చేసింది మీరు కాదా? శ్రీవారి హుండీలో కానుకలు పడకుండా వైకాపా కుట్ర చేస్తోంది' అని భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల పరకామణి చోరీ కేసుపై ఆనాడే ఎందుకు చర్యలు తీసుకోలేదని నాటి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై జరుగుతున్న ఆరోపణలు, హుండీ కానుకలపై కుట్రలను ఆయన తీవ్రంగా ఖండించారు. పరకామణిలో 2025 జనవరిలో జరిగిన చోరీ చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగిని అప్పుడే అరెస్టు చేసి, కేసులు నమోదు చేసి, బంగారం రికవరీ కూడా చేశారని భాను ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ రోజు సాక్షి పత్రికలోనూ ఈ వార్త ప్రచురితమైందని తెలిపారు. అయితే ఇప్పుడు దాన్ని కొత్తగా జరిగినట్టు పెద్ద అక్షరాల్లో వార్తలు రాయడం వెనుక తిరుమల హుండీకి కానుకలు రాకుండా చేసే కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. 2023, జూన్ 13న భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు శివశంకర్ అనే విజిలెన్స్ అధికారి.. భక్తుల నుంచి దొంగతనం చేసిన దొంగను ఆలయంలో పట్టుకున్నారని తెలిపారు. ఆ దొంగ నుంచి శివశంకర్ డబ్బులు కొట్టేశారని భాను ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. అతన్ని ప్యారెంట్ డిపార్ట్‌మెంట్‌కు పంపి కరుణాకర్ రెడ్డి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రవికుమార్ ఇష్యూలో సాక్ష్యాలను తారుమారు చేయడంలో శివశంకర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. హుండీలో దొంగతనం చేసిన రవికుమార్‌తో చెట్టుకింద పంచాయితీ చేసి భాగాలు పంచుకున్నారని వ్యాఖ్యలు చేశారు. టీటీడీలో అవినీతి జరగలేదని తడిబట్టలతో తాను కాణిపాకంలో ప్రమాణం చేస్తానని.. కమిషన్లు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా? అని భూమన కరుణాకర్‌రెడ్డికి సవాల్ విసిరారు. తన పార్టీకి తాను ఏమిటో తెలుసన్నారు. నెయ్యి కొరత ఉందని తిరుమలను టార్గెట్ చేసి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారు ప్రింట్ చేసిన భగవద్గీత ముందు మాటలో 'మాట తప్పని.. మడమ తిప్పని' అని రాసుకున్నారని.. కానీ కంటెంట్ లేని లక్షల పుస్తకాలు గోదాముల్లో పడి ఉన్నాయని సెటైర్ విసిరారు. టీటీడీపై చేసే రాజకీయ ఆరోపణలకు టీటీడీ ఈవో సమాధానం చెప్పాల్సిన పని లేదన్నారు. టీటీడీకి ఉన్న క్రెడిబిలిటీని దెబ్బతీయడానికి తాడేపల్లి ప్యాలెస్ అనకొండలను వదులుతోందని ఆరోపించారు. తిరుమలలో ఆదిశేషుడు ఉన్నారని.. వారి ముందు ఈ అనకొండలు ఏమీ చేయలేవని భాను ప్రకాశ్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతేడాది జనవరి 11న పరకామణిలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెంచలయ్య 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను అపహరించేందుకు యత్నించినప్పుడు తితిదే విజిలెన్స్, సెక్యూరిటీ అప్రమత్తంగా వ్యవహరించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పింది. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించినట్లు తెలిపింది. ఈ ఘటనను వక్రీకరించి పరకామణిలో భారీ స్థాయిలో బంగారం దొంగతనం జరిగినట్లు, రూ.కోట్ల విలువైన బంగారం మాయమైనట్లు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని ప్రకటనలో పేర్కొంది.

# అంబేడ్కర్ రాజ్యాంగం కాదు..కాంగ్రెస్ రాజ్యాంగం

- స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి11( వెలుతురు):**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేయడంపై బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పందించారు. స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది అంబేద్కర్ రాజ్యాంగం కాదు.. కాంగ్రెస్ రాజ్యాంగమని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ద్వంద్వ నీతికి స్పీకర్ తీర్పు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పును కాలరాసి కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ టికెట్ మీద ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్, కూతుర్ని కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయించి, కండువా వేసుకుని తిరిగి చేతి గుర్తుకు ఓటేయమని కోరిన కడియం శ్రీహరికి క్లీన్‌చిట్ ఇవ్వడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. నిత్యం రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలును గాలికి వదిలేయడమే కాదు.. రాజ్యాంగాన్ని కూడా గాలికి వదిలేశాడని నిరంజన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ నిధుల దోపిడీకి ఇక్కడ అధికారాన్ని అడ్డుపెట్టుకున్నారు అనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని అన్నారు. అందుకే ఇక్కడి పరిణామాలపై, ఇక్కడి ప్రభుత్వ అరాచకాలపై కాంగ్రెస్ అధిష్ఠానం నోరెత్తడం లేదని విమర్శించారు.

# టీస్టాల్ తొలగింపుతో రోడ్డున పడ్డ కుటుంబం

**జనగామ, మార్చి11( వెలుతురు):**

జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివాదాస్పద నిర్ణయంతో ఓ నిరుపేద దళిత కుటుంబం రోడ్డున పడింది. వివరాల్లోకి వెళ్తే..ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన వనిత టీ స్టాల్,(÷ఎజీనితిబితజీ బి।జీ బబిజ్గీ÷) మిల్క్ పార్లర్‌ను జిల్లా కలెక్టరేట్ ఎదురుగా పూర్వ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. కాగా, దీనిని తొలగించాలంటూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలు జారీ చేయడంతో వనిత టీ స్టాల్‌ను మున్సిపల్ అధికారులు తొలగించారు. సీపీఎం నాయకులు అడ్డుపడినప్పటికి అధికారులు అక్కడ నంచి టీస్టాల్‌ను తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# విరిగిన విమాన ల్యాండింగ్ గేర్

- రన్‌వేపై థాయి విమానానికి తప్పిన ముప్ప



**హైదరాబాద్, మార్చి11( వెలుతురు):**

సాంకేతిక సమస్య, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తరచూ విమాన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తో సహా ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంటే.. తాజాగా హైదరాబాద్ నుంచి బయలుదేరిన విమానంకి పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి థాయిలాండ్ బయల్దేరిన ఎయిరిండియా విమానానికి (బోయింగ్ 737) ప్రమాదం తప్పింది. బుధవారం ఫుకెట్ ఎయిర్ ఫోర్టులో ల్యాండ్ అయిన వెంటనే నోస్ వీల్ (ఫ్రంట్ ల్యాండింగ్ గేర్) ఊడిపోయింది. దీంతో విమానం రన్ వే నుంచి పక్కకు జారింది. వెనుక టైర్ కూడా పేలిపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానం తక్కువ వేగంతో ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ విమానంలో ఉన్న 133 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# హాస్టళ్లపై గ్యాస్ సరఫరా ఎఫెక్ట్

- తగ్గిన ఫుడ్ ఐటమ్స్ సరఫరా

**హైదరాబాద్, మార్చి11( వెలుతురు):**




మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం హైదరాబాద్‌లోని హాస్టల్స్‌పై పడింది. ఇరాన్– ఇజ్రాయెల్ ఉద్రిక్తతల మధ్య గ్యాస్ సంక్షోభం వాటిల్లిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుత హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా తగ్గింది. ఐటీ కారిడార్‌లో గ్యాస్ సరఫరా తగ్గడంతో ఫుడ్ ఐటమ్స్ తగ్గించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలవడంతో హాస్టల్ యాజమాన్యాలు ఆందోళనలో ఉన్నాయి.. ఈ అంశంపై హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిందని.. కావల్సినంత గ్యాస్ సరఫరా లేదన్నారు.. ప్రస్తుతం నగరంలో పదకొండు వేల హాస్టల్స్ ఉన్నాయని.. లక్షల మంది హాస్టల్స్‌లో ఉన్నారన్నారు.. ఎడ్యుకేషన్.. హాస్పిటల్‌కు సంబంధించిన హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా చేస్తున్నారని చెప్పారు.. 'కమర్షియల్ గ్యాస్ ఇవ్వకుంటే.. డొమెస్టిక్ గ్యాస్ రోజుకి ఒకటైన ఇవ్వాలని కోరారు.. అధికారులతో మాట్లాడాం.. రెస్పాన్స్ లేదు.. గ్యాస్ ఎక్కువగా కన్సంప్షన్ అయ్యే ఫుడ్ ఐటమ్స్ తగ్గిస్తున్నాం.. చపాతి దోశ వంటి ఐటమ్స్ తగ్గిస్తామని చెప్పాం.. హాస్టల్స్ మూసేసే పరిస్థితి రాదని అనుకుంటున్నాం..' అని హాస్టల్ యాజమాన్యాలు వెల్లడించాయి.

# కేంద్రమాజీమంత్రి కావూరి మృతి

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణం
- కావూరి మృతిపై చంద్రబాబు తదితరుల సంతాపం



**హైదరాబాద్, మార్చి11( వెలుతురు):**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కావూరి సాంబశివరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎంపిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. మన్మోమన్ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం రాజకీయ రంగానికి తీరని లోటుగా పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు నేతలు కావూరి సాంబశివరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసిన కావూరి సాంబశివరావు మరణం తీరని లోటని పేర్కొన్నారు. రాజకీయ, వ్యాపార రంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర అని కొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నేత కావూరి సాంబశివరావు అనారోగ్యంతో కన్నుమూశారని తెలిసి విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఐదుసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా వారు ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. రాజకీయంలో వారికున్న సుదీర్ఘ అనుభవంతో.. ప్రజాసమస్యలపై పార్లమెంటు లోపలా, బయటా తన గళాన్ని వినిపించారని ప్రశంసించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రగతి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కావూరి సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.కావూరి సాంబశివరావు మరణం పట్ల కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి కావూరి అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై నిరంతరం గళం వినిపించిన గొప్ప నాయకుడు కావూరి అని ప్రశంసించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, ముఖ్యంగా బీజేపీ కుటుంబానికి తీరని లోటని భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతికి మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. కావూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పనబాక లక్ష్మి పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని అన్నారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు కావూరి అని కొనియాడారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి 5 సార్లు ఎంపీగా గెలిచిన నిబద్ధత గల నేతను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని లగడపాటి రాజగోపాల్ తెలిపారు.

# అమెరికా ఆర్థిక సంస్థలపై దాడుల చేస్తాం

- అమెరికా యుద్ధంపై ఇరాన్ హెచ్చరిక




**టెహ్రాన్, మార్చి11( వెలుతురు):**

ఇరాన్– ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ సంస్తలు, బ్యాంకులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా ఇలాగే అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ కంట్రీస్‌లోని అమెరికాకు చెందిన సంస్థలపై దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. ఈ దాడులకు సంబంధించి అమెరికన్ సంస్థల టా÷–గ్గ్÷ట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది.ఇందులో ప్రముఖ అమెరికన్ టెక్ కంపెనీలు, ఇన్‌ఫ్రా కంపెనీలున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, పాలంటిర్, నివిడియా, ఒరాకిల్ వంటి సంస్థలున్నాయి. ఈ సంస్థలు గల్ఫ్ కంట్రీస్‌లో, ఇజ్రాయెల్‌లలో పలు ఆఫీసుల నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ ఒకరిపై ఒకరు చమురు సంస్థలు, ఆర్థిక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసుకుంటున్నాయి. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా నిలిచిపోవడంతో ఇండియా, చైనా వంటి పలు ఆసియా దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

# అగ్నిప్రమాదంపై విచారణ

- ఆదేశించిన హోంమంత్రి అనిత

**అమరావతి, మార్చి11( వెలుతురు):**



అమరావతిలోని వెలగపూడి అగ్నిప్రమాదం ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా కుట్ర కోణం దాగి ఉందా? అనే అంశాలపై విచారణ చేపట్టాలన్నారు. ఘటనాస్థలంలో సమీప పొలం నుంచి మంట వచ్చిందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు చెప్పారు. పొలంలో గడ్డి పేర్చి నిప్పుపెట్టిన ఆనవాళ్లను చూపించారు. అమరావతిలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన మంటలు చెలరేగి ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన ఎ÷–లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. భారీగా మంటలు ఎగసిపడటంతో పరిసరాల్లో దట్టంగా పొగ అలముకొంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అయితే ఘటనపై అనుమానాలు రావడంతో విచారణకు ఆదేశించారు.

# ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం దారుణం

- లోక్‌సభలో లేవనెత్తుతాం అన్న సురేశ్ రెడ్డి



**న్యూఢిల్లీ, మార్చి11( వెలుతురు):**

తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి వెల్లడించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని అపహాస్యం చేసినట్లేనని పేర్కొన్నారు. రాజ్యాంగంలో మార్పులు కావాలని కాంగ్రెస్ కేంద్ర నాయకులు, రాహుల్ గాంధీ మాట్లాడుతున్నా, తెలంగాణలో దీనికి పూర్తి వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మళ్లీ ఇంకో పార్టీ నుంచి పోటీ చేసిన విషయం స్పష్టంగా రుజువులున్నా కూడా స్పీకర్ ఇచ్చిన తీర్పు నవ్వుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తీర్పులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు. కేసీఆర్ తమకు ఇచ్చిన ఆదేశాలన్నింటినీ పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నామని, పార్టీ ఫిరాయింపులపై కూడా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. స్పీకర్ తీర్పుపై అన్ని అవకాశాలను ఉపయోగించి, జ్యుడిషియల్ రివ్యూకు వెళ్తామని స్పష్టం చేశారు.


వెలుతురు

cinema

## ది ప్యారడైజ్‌లో ఆయా షేర్ సాంగ్ పాపులర్

### మూవీలో నాని నేపథ్యంపై కాసర్ల ఫీలర్

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రస్తుతానికి 'ది పారడైజ్' అనే సినిమా రూపొందుతోంది. ఈ సినిమాను ఒక పూర్తిస్థాయి రా అండ్ రస్టిక్ సినిమాగా రూపొందిస్తున్నారు మేకర్స్. నాని కెరీర్‌లోనే మొట్టమొదటిసారిగా, ఎప్పుడూ ఊహించని విధంగా ఈ సినిమాలో ఒక రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ బాగా వర్కవుట్ అయింది, ప్రేక్షకులలో అంచనాలు రేకెత్తించింది. ఇక తాజాగా రిలీజ్ అయిన 'ఆయా షేర్' సాంగ్ బాగా ప్రేక్షకులలోకి వెళ్ళింది. ముఖ్యంగా సాంగ్ భిన్నంగా ఉండడంతో, ఈ సాంగ్ వినేందుకు శ్రోతలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సాంగ్ రాసిన లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ మీడియాతో ఈ సాంగ్ విశేషాలు పంచుకున్నారు. అయితే ఈ విశేషాలు పంచుకుంటున్న క్రమంలో ఆయన ఈ సినిమాలో నాని నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. నిజానికి ఈ సినిమాలో నాని ఒక వేశ్యా వాటికలో ఉంటాడని ముందు నుంచి ప్రచారం జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు నాని తెగ పేరును పొరపాటున కాసర్ల శ్యామ్ సంబోధించారు. ఈ తెగ 'సవారి తెగ' అని కాసర్ల శ్యామ్ చెప్పుకొచ్చారు. ఈ సాంగ్ చేయడం తనకు చాలా అదృష్టమని, 'దసరా' తర్వాత తనకు ఈ సినిమా కూడా అంత పేరు తెచ్చే సినిమా అవుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.







## సుడిగాలి సుధీర్ ..మూవీ గోట్

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) మార్చ్ 11 :** ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్. గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్ అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను మార్చి 26న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. త్వరలోనే ఈ చిత్రం నుంచి ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ.. ప్రస్తుతం గోట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలువబోతుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుందని. తప్పకుండా ఈ చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వధమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆడుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మి సాయి, నవీన్ నేని, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, నేపథ్య సంగీతం: మణిశర్మ, డీఓపీ: రసూల్ ఎల్లోర్, ఆడిషనల్ డీఓపీ: సన్నీ కూరపాటి, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్, , కో ప్రొడ్యూసర్: సమైరా రెడ్డి.ఎన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ప్రసూన మండవ, దర్శకత్వం: వేదవ్యాస్, నిర్మాత: చంద్రశేఖర్ మొగుళ్ళ

## త్రిష, విజయ్‌లది వ్యక్తిగత వ్యవహారం

### నటి ఖుష్బూ కామెంట్



తమిళ స్టార్ నటుడు, తమిళ వెట్రీ కళగం అధినేత విజయ్ మరియు హీరోయిన్ త్రిషల వ్యక్తిగత జీవితంపై నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక వివాహ రిసెప్షన్‌కు విజయ్ త్రిష కలిసి ఒకే కారులో రావడం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విజయ్ భార్య సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారనే వార్తల మధ్య వీరిద్దరూ కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ వివాదంపై ఖుష్బూ స్పందిస్తూ.. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయమని, దానిని భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని పేర్కొంది. విజయ్, త్రిషల వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధం ఉంటుందో తనకు అర్థం కావడం లేదని.. అది వారి పర్సనల్ లైఫ్ అని, దానిని గౌరవించాలని సూచించింది. విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లో చురుగ్గా ఉన్న నేపథ్యంలో ఈ వివాదం ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందా? అని అడగ్గా.. ప్రజలు చాలా తెలివైన వారు. ఎవరికి ఓటు వేయాలో వారికి తెలుసు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు అని తెలిపింది. నటులైనా, రాజకీయ నాయకులైనా వారు కూడా మనలాగే సాధారణ మనుషులని, వారి ప్రైవసీని దెబ్బతీయడం సరికాదని ఈ సందర్భంగా ఖుష్బూ చెప్పుకొచ్చింది.



## ప్రభాస్‌తో ఎకో డైరెక్టర్ ఫోటో

### కొత్త మూవీ చర్చలంటూ హల్‌చల్

ప్రస్తుతం సోషల్ మీడియాలో రెబల్ స్టార్ ప్రభాస్ మరియు మలయాళ సెన్సేషనల్ డైరెక్టర్ దిన్‌జిత్ అయ్యతాన్ కలిసి ఉన్న ఒక ఫోటో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతుందనే వార్తలకు బలం చేకురుస్తుంది. ఇటీవల 'కిష్కింధ కాండం' మరియు 'ఏకో' వంటి విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దిన్‌జిత్, స్వయంగా ప్రభాస్‌ను కలిసిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని, ముఖ్యంగా ఆయన వడ్డించిన రుచికరమైన 'ప్రాన్స్ బిర్యానీ'ని ప్రశంసిస్తూ దిన్‌జిత్ పెట్టిన ఇన్స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ముఖ్యంగా ఈ సమావేశం వెనుక హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఉండటం గమనార్హం. గతంలోనే హోంబలే సంస్థ ప్రభాస్‌తో మూడు సినిమాల భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'సలార్ 2' కాకుండా, మిగిలిన రెండు చిత్రాల్లో ఒకటి దిన్‌జిత్ దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. విలక్షణమైన థ్రిల్లర్లను తెరకెక్కించడంలో దిన్‌జిత్ సిద్ధహస్తుడు కావడంతో, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక సరికొత్త తరహా కథను ఆయన సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' మరియు 'కల్కి 2' వంటి భారీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబో ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఇద్దరి కలయికతో ఒక డిఫరెంట్ సినిమాను చూడవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు.

## పొరపాటు కామెంట్స్

### మహేశ్ అభిమానులకు హరీష్ క్షమాపణలు



సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు దర్శకుడు హరీష్ శంకర్ క్షమాపణలు చెప్పాడు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో జరిగిన ఒక చిన్న పొరపాటు ఈ వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ అభిమాని ఒకరు ఎక్స్ వేదికగా ఈ సినిమా మహేష్ బాబు రికార్డులను బద్దలు కొట్టాలనే అర్థం వచ్చేలా ఒక పోస్ట్ చేశారు. దీనికి హరీష్ శంకర్ రిప్లై ఇవ్వడంతో మహేష్ బాబు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ వివాదం ముదరడంతో హరీష్ శంకర్ వెంటనే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. షూటింగ్ పనుల్లో మరియు సెన్సార్ కార్యక్రమాల్లో బిజీగా ఉండటం వల్ల ఆ ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే, కేవలం అభిమాని ఉత్సాహాన్ని చూసి పొరపాటున స్పందించానని ఆయన పేర్కొన్నారు. తనకు మహేష్ బాబు అంటే ఎంతో గౌరవమని, గతంలో ఆయన నటించిన 'పోకిరి' సినిమా గురించి కూడా తాను ఎంతో పాజిటివ్‌గా మాట్లాడానని గుర్తుచేశారు. అంతేకాకుండా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా పెద్ద రికార్డులు సృష్టించాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన రిప్లై వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే బేషరతుగా క్షమాపణలు కోరుతున్నానని హరీష్ శంకర్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సమయంలో తాను కావాలని ఇలాంటి వివాదాలు చేసే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు.




## జునైద్ ఖాన్‌తో సాయిపల్లవి జోడీ ఏక్ దిన్ ట్రైలర్ విడుదల

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మరియు సౌత్ సెన్సేషన్ సాయి పల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందంవిడుదల చేసింది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒక రోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం ద్వారా సాయి పల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

## జగపతి బాబు 'వదలా' గ్లింప్స్ విడుదల.. ఆకట్టుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్!

ఝునష్త్రుశ్రీఝ వీశీజఱవ । జగపతి బాబు, లయ, హృతిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వదలా' వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ఆకెళ్ల వి. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్‌తో పాటు కిశోర్ నాయుడు కలిసి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా.. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా చిత్ర బృందం ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేయగా ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ గ్లింప్స్ ఆధారంగా పరిశీలిస్తే.. ఇది ఒక వ్యక్తి జీవితం మరియు అతని చుట్టూ అల్లుకున్న రహస్యాల నేపథ్యంలో సాగే గ్రిప్పింగ్ డ్రామా అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా జగపతి బాబు నటన, ఆయన పాత్ర తీరుతెన్నులు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. చాలా కాలం తర్వాత లయ ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో కనిపించబోతుండటం విశేషం. గ్లింప్స్‌లోని విజువల్స్ మరియు నేపథ్య సంగీతం సినిమాలోని తీవ్రతను, ఉత్కంఠను తెలియజేస్తున్నాయి. ఒక విభిన్నమైన పాయింట్‌తో, ఎమోషనల్ అండ్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.



# అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ

- 300 బిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్ట్
- రిలయన్స్‌తో అమెరికా ప్రభుత్వం ఒప్పందం
- సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్




**వాషింగ్టన్, మార్చి11( వెలుతురు):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 300 బిలియన్ డాలర్ల చమురు శుద్ధి కర్మాగార ప్రాజెక్టును టెక్సాస్‌లో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో భారతదేశ రిలయన్స్ ఇండస్ట్రీ భాగస్వామి క ఆవడం విశేషం. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ ప్రాజెక్టును అమెరికా చరిత్రలో అతిపెద్ద ఒప్పందం గా పేర్కొన్నారు. ఇది అమెరికన్ కార్మికులు, ఇంధన వృద్ధి, దక్షిణ టెక్సాస్ ప్రజలకు భారీ విజయం అని అభివర్ణించారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. ఈ ప్రాజెక్టు దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడానికి ఓ ముఖ్యమైన దశగా ఉంటుంది. బ్రౌన్స్‌విల్లే నౌకాశ్రయంలో ఉనికిలో ఉండే అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తుంది. ట్రంప్ ఈ ప్రాజెక్టును ఆర్థిక, వ్యూహాత్మక మైలురాయిగా పేర్కొన్నారు. అయితే, పెట్టుబడి నిర్మాణం, ఖర్చులు లేదా ఆర్థిక వివరాలపై ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. గత 50 ఏళ్లలో అమెరికా గడ్డపై నిర్మించతలపెట్టిన మొట్టమొదటి రిఫైనరీ ఇదే కావడం విశేషం. ఈ మెగా ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్' కీలక భాగస్వామిగా చేరడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సుమారు 300 బిలియన్ల డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా అమెరికా-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన మరియు అత్యాధునికమైన రిఫైరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నందుకు రిలయన్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాలకు గెలుపు లాంటిదని అభివర్ణించారు. ఈ భారీ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, అమెరికా ఇంధన భద్రతను గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, టెక్సాస్ ప్రాంత ఆర్థిక పురోగతికి ఇది కీలకం కానుంది. పర్యావరణ హితంగా ఉండేలా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఇంధనాన్ని శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. గతంలో పెట్రోలియం రంగంలో రిలయన్స్‌కు ఉన్న అపారమైన అనుభవం, ముఖ్యంగా జామ్‌నగర్ వంటి అతిపెద్ద రిఫైనరీల నిర్వహణ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ట్రంప్ యంత్రాంగం ఈ డీల్‌కు మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందం వల్ల అమెరికా చమురు దిగుమతుల పై ఆధారపడటం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్లో తన పట్టును మరింత బిగించే అవకాశం ఉంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.


## హర్ముజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు

- ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌పలు నౌకలు ధ్వంసం




**టెహ్రాన్, మార్చి11( వెలుతురు):**
చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యాజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అవి ధ్వంసమయ్యాయి. తాము జరిపిన దాడుల్లో ఇరాన్ కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. జలసంధిలో పేలుడు సృష్టించడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందిందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. జలసంధి సమీపంలో ఇరాన్ ఎక్కడైనా మైన్స్‌ను అమర్చినట్లయితే.. వాటిని తక్షణమే తొలగించాలని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. లేదంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా.. మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ స్వయంగా వాటిని తీసేస్తే.. అది మంచి పరిణామం అన్నారు. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను వాడి జలసంధిలోని మైన్‌లేయర్స్ పడవలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ట్రంప్ హెచ్చరికల తర్వాత ఇరాన్ మైన్‌లేయర్స్‌ను ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యాజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడడంతో అవి ధ్వంసమయ్యాయి. తాము చేపట్టిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్రమంలనే దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది.ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు ఇచ్చిన అనుమతి వల్ల పుతిన్ సర్కార్‌కు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని శ్వేతసౌధం ప్రకటించింది.

# ఏపీ లిక్కర్ స్కామ్.. 3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు




**విజయవాడ, మార్చి11( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది.మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది.సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది.కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలు?పంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ంఖూఃఅఒ కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది.కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది.ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి.ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

## ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

- 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం





**లాస్ ఏంజిల్స్,మార్చి11( వెలుతురు):**
ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగ్రశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు.98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

## 17న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన టిటిడి

**తిరుమల, మార్చి11( వెలుతురు):**



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది ఉత్సవాలకు ముందు మంగళవారం కోయిల ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆపవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా 18వ తేది విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరని టిటిడి తెలిపింది.

# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసంపై చర్చ

- విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకున్నారన్న రాహుల్
- స్పీకర్‌ను అవమానించినా భరించారన్న రవిశంకర్ ప్రసాద్




**న్యూఢిల్లీ, మార్చి11( వెలుతురు):**
పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత మాట్లాడకుండా స్పీకర్ ఓం బిర్లా అనేక సార్లు అడ్డుకున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ చర్చ ప్రజాస్వామ్యం అన్నారు. పదే పదే స్పీకర్ ఓం బిర్లా తనను మాట్లాడకుండా అడ్డుకున్నారని.. లోక్‌సభ అనేది దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించలేదని రాహుల్ గాంధీ అనగానే? బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ కలుగజేసుకుని.. ఎప్పుడూ? ఎప్పుడూ? ఎప్పుడూ అని అడిగారు. ప్రధాని మోడీ, స్పీకర్ కుర్చీని విపక్ష సభ్యులు చాలాసార్లు చుట్టుముట్టారని, కాగితాలు విసిరారని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కానీ స్పీకర్ ఎప్పుడూ నవ్వుతూనే ఉన్నారని పేర్కొన్నారు. స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలనే తీర్మానంపై లోక్‌సభలో చర్చ సాగుతోంది. రవిశంకర్ ప్రసాద్ బుధవారం చర్చను ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల్లో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు రావడం ఇది రెండోసారి మాత్రమే అని అన్నారు. 'స్పీకర్ వైఖరి, అవిశ్వాసాన్ని సాధనంగా ఉపయోగించకూడదు. డాక్టర్ అంబేద్కర్‌ను ఉటంకిస్తూ స్పీకర్‌కు గౌరవం ఉందని.. సభకు జవాబుదారీగా ఉంటారు. ఈ సభ అనేక ఒడిదుడుకులను చూసింది. ప్రతిసారీ పార్లమెంటు కొత్త ఎత్తులకు చేరుకుంది. ఈ సభలోనే 11 మంది ఎంపీలు బహిష్కరించబడ్డారు. అత్యవసర పరిస్థితి విధించబడిన బాధాకరమైన క్షణం కూడా ఉంది. ఈ సభ తన ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని ఆరు సంవత్సరాలకు పొడిగించింది. నిన్న అక్కడి నుంచే హక్కుల గురించి చాలా చర్చ జరిగింది. వాజ్‌పేయి, అద్వానీ, మధు దండవతే లేదా చంద్రశేఖర్ అందరూ జైలులో ఉన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను వ్యతిరేకించి వాటిని అధిగమించిన ధైర్యవంతుడైన న్యాయమూర్తి హెచ్ ఆర్ ఖన్నా ఉన్నాడని వారు చాలా బాధపడ్డారు. జయప్రకాష్ నారాయణ్ మూత్రపిండాల వైఫల్యంతో ముంబైలోని జాస్లోక్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు సూర్యరశ్మి చేయాలని సూచించారు. దీని కోసం ఆయన హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాతే ఆయనను గంటసేపు ఎండలో కూర్చోవడానికి అనుమతించారని రవిశంకర్ ప్రసాద్ గుర్తుచేశారు.

## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- ఫిరాయంపు ఎమ్మెల్యేల తీర్పుపై లక్ష్మణ్

**న్యూఢిల్లీ, మార్చి11( వెలుతురు):**
పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ అభివర్ణించారు. ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. బుధవారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం, కడియం శ్రీహరిల పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం విచారించారు అనంతరం ఆ పిటిషన్లను ఆయన కొట్టేశారు. ఈ వ్యవహారంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ న్యూఢిల్లీలో స్పందించారు. ఈ వ్యవహారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులకు నిర్వచనం ఏమిటంటూ సందేహం వ్యక్తం చేశారు. ఒకరు ఎంపీగా పోటీ చేశారని.. ఇంకొకరు ఎన్నికల్లో ప్రచారం చేశారని గుర్తు చేశారు. గతంలో నైతిక విలువలతో అటల్ బీహార్ వాజపేయి రాజీనామా చేసి, ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో గెలిచారని సోదాహరణగా వివరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికి మచ్చ అని అభిప్రాయపడ్డారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ హోల్‌సేల్‌గా.. నేడు కాంగ్రెస్ పార్టీ రిటైల్‌గా వ్యవహరించిందని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం ఉంటే.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపై స్పందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ స్పీకర్ వ్యవస్థకు మచ్చ తెచ్చే విధంగా వ్యవహరించారని విమర్శించారు. దేశానికి తలవంపులు తెచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉందన్నారు. ఇంత గుడ్డిగా వ్యవహరించడం దేని కోసమని సందేహం వ్యక్తం చేశారు. రక్షకులు భక్షకులుగా మారారంటూ బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ ధ్వజమెత్తారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com